


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 174, పేజీలు - 08

శుక్రవారం, డిసెంబర్ 5, 2025 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# ఎయిర్ బస్సును ఆదిలాబాద్‌కు తెస్తాం

## - రెండేళ్లలో ఒక గంట కూడా సెలవు తీసుకోలేదన్న సీఎం రేవంత్



- ఆదిలాబాద్‌లో విమానాశ్రయ పనులు ప్రారంభిస్తామని వెల్లడి
- ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు చేయాలన్న రేవంత్ రెడ్డి
- కేంద్రం, విపక్షాలను కలుపుకుని ముందుకు సాగుతామని వెల్లడి



**ఆదిలాబాద్ (ప్రశ్న న్యూస్)** ఆదిలాబాద్‌కు ఎర్రబస్సే కాదు ఎయిర్ బస్సును కూడా తీసుకువస్తాం అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణలోని వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధి చేసే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ మేరకు ముఖ్యమంత్రి పలు కీలక హామీలను ఇచ్చారు. అభివృద్ధి చెందిన జిల్లాగా తెలంగాణలో అగ్రస్థానంలో నిలబెట్టే విధంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. ప్రజా పాలన - ప్రజా విజయోత్సవాలు కార్యక్రమాల్లో భాగంగా ఆదిలాబాద్ పట్టణంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బహిరంగ సభలో మాట్లాడుతూ ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టు, చనాక - కొరాట ప్రాజెక్టు, విమానాశ్రయం, విశ్వవిద్యాలయం ఏర్పాటు, సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం వంటి కీలకమైన ప్రాజెక్టులపై స్పష్టమైన ప్రకటన చేశారు.

### ప్రాణహిత చేవెళ్ల ద్వారా నీళ్లు

తుమ్మిడిహట్టి వద్ద డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత

2లో..

# ఢిల్లీలో రష్యా అధ్యక్షుడు పుతిన్

## ప్రోటోకాల్ పక్కన పెట్టి స్వాగతం పలికిన ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తన రెండు రోజుల భారత పర్యటన కోసం ఢిల్లీ చేరుకున్నారు. ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆయనకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా ఆహ్వానించారు. ఈ పర్యటన భారత్-రష్యా మధ్య 75 ఏళ్ల సన్నిహిత సంబంధాలను బలోపేతం చేయడానికి, రక్షణ, వాణిజ్యం, శక్తి విభాగాల్లో కొత్త ఒప్పందాలను చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. పుతిన్ ఐటీసీ మౌర్యా హోటల్‌లో ఉంటారు, రాత్రి మోదీతో ప్రైవేట్ డిన్నర్‌లో ముఖ్య చర్చలు జరుగనున్నాయి. పుతిన్ తన ప్రత్యేక విమానం ఇల్యూషిన్

2లో..

ఎన్నికల ప్రక్రియ, రిజర్వేషన్‌లలో

# జోక్యం చేసుకోలేం

## - తెలంగాణ హైకోర్టు స్పష్టీకరణ





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా, ప్రభుత్వం కేటాయించిన రిజర్వేషన్‌ల వ్యవహారంలో జోక్యం చేసుకోలేమని రాష్ట్ర హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు, రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన రిజర్వేషన్‌లకు వ్యతిరేకంగా దాఖలైన ఆరు పిటిషన్‌లపై విచారణ జరిపిన హైకోర్టు, గురువారం తీర్పును వెలువరించింది. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్‌లలో జోక్యం చేసుకోలేమని తేల్చి చెప్పింది. ఎస్సీ, ఎస్టీ జనాభా లేని ప్రాంతాల్లో సైతం ఆయా కులాలకు వార్డు మెంబర్లు, సర్పంచ్ రిజర్వేషన్లు


2లో..

# 45 రోజుల్లోగా మెజార్టీ ఎంఓయూలు కార్యరూపం దాల్చాలి

## - సీఎం చంద్రబాబు ఆదేశం



- రాష్ట్రానికి రూ.20,444 కోట్ల విలువైన పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం
- రాష్ట్రంలో 56,278 మందికి కొత్తగా ఉద్యోగావకాశాలు
- 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' వల్లే ఏపీకి పరిశ్రమలు వస్తున్నాయన్న చంద్రబాబు
- రూ.500 కోట్లతో రాష్ట్రంలో సావరిన్ ఫండ్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి సూచన



అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సీఐఐ భాగస్వామ్య సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాల్లో 50 శాతానికి పైగా ఆమోద ప్రక్రియలోకి వచ్చాయని, 45 రోజుల్లోగా వీటికి శంకుస్థాపన జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన గురువారం సచివాలయంలో 13వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల బోర్డు సమావేశం జరిగింది. ఇందులో రూ. 20,444 కోట్ల విలువైన పెట్టుబడులకు 13వ ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. దీంతో 56,278 మందికి ఉద్యోగావకాశాలు వస్తాయి. ఇటీవల విశాఖలో జరిగిన పెట్టుబడుల సదస్సులో ఒప్పందాలు కుదుర్చుకున్న 6 కంపెనీలకు కూడా ఎస్ఐపీబీ

2లో..

# మేము వచ్చాక హిల్ట్ పాలసీ రద్దు

- మేం వచ్చాక భూములు వెనక్కి తీసుకుంటామన్న కేటీఆర్
- జీడిమెంట్ల పారిశ్రామికవాడలో పర్యటించిన కేటీఆర్
- అనుముల రేవంత్ రెడ్డి కాదు.. అవినీతి కొండ అని విమర్శ
- ఢిల్లీకి మూటలు పంపించే ప్రయత్నాన్ని అడ్డుకుంటామని వ్యాఖ్య




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ ప్రభుత్వం హిల్ట్ పాలసీ పేరుతో 5 లక్షల కోట్ల రూపాయల భారీ భూమి కుంభకోణానికి పాల్పడుతున్నదని కేటీఆర్ ఆరోపించారు. మేడ్చల్ జిల్లా షాపూర్ నగర్ జీడిమెట్ల పారిశ్రామిక వాడలో అక్కడి పరిశ్రమల కార్మికులతో కలిసి ఆందోళనలో పాల్గొన్నారు. ఒకప్పుడు ప్రభుత్వాలు ప్రజలు పరిశ్రమల కోసం ఉద్యోగ ఉపాధి కల్పన కోసం ఇచ్చిన భూములను ఇప్పుడు ప్రవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తుందని కేటీఆర్ ఆరోపించారు. పరిశ్రమలు వద్దు అంటూ అపార్ట్మెంట్లు విల్లలు

2లో..

రైతుల పరిస్థితి చూస్తుంటే

# 'సేవ్ ఏపీ' అనాల్సి వస్తోంది

- రాష్ట్రంలో రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందన్న జగన్
- చంద్రబాబు ప్రభుత్వం ఉచిత పంటల బీమాను నీరుగార్చిందని విమర్శ
- ఇన్‌పుట్ సబ్సిడీ బకాయిలు, గిట్టుబాటు ధరపై స్పష్టత లేదని మండిపాటు



అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో రైతుల పరిస్థితిని చూస్తుంటే 'సేవ్ ఆంధ్రప్రదేశ్' అనాల్సిన దుస్థితి నెలకొందని వైసీపీ అధినేత జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రభుత్వ పాలనలో రైతుల జీవితాలు ఛిన్నాభిన్నమయ్యాయని, పండుగలా ఉండాల్సిన వ్యవసాయం దండగలా మారిందని ఆయన తీవ్రంగా విమర్శించారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ప్రభుత్వ విధానాలను

2లో..

ప్రతిభకు ఆర్థిక ఇబ్బందులు

# అడ్డురాకూడదు

## - అభయ హస్తం చెక్కులు అందజేసిన డిప్యూటీ సీఎం




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సివిల్ సర్వీస్ ఉద్యోగం సాధించాలనుకునే తెలంగాణ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం 'రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం' పథకం ద్వారా అపూర్వమైన మద్దతును అందిస్తోంది. అత్యంత ప్రతిష్టాత్మకమైన యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ఇంటర్వ్యూ దశకు చేరుకున్న అభ్యర్థులకు ఆర్థికంగా అకాడమిక్‌గా ప్రభుత్వం చేయూతనిస్తోంది. తెలంగాణ అభ్యర్థులు ఆర్థిక భారం లేకుండా ఇంటర్వ్యూ దశకు సిద్ధమయ్యేందుకు ఈ పథకం దోహదపడుతుంది. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ఇంటర్వ్యూకు ఎంపికైన ప్రతి అభ్యర్థికి రూ. 1 లక్ష చొప్పున ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోంది. ఈ పథకం కింద అర్హత ఉన్న అభ్యర్థులందరికీ ఈ ప్రోత్సాహం అందిస్తారు. లబ్ధిదారుల సంఖ్యపై ఎటువంటి పరిమితి విధించలేదు. ఆర్థికంగా వెనుకబడిన అభ్యర్థులకు చేయూతనిచ్చేందుకు ఈ పథకాన్ని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్సీసీఎల్) తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధుల ద్వారా అమలు చేస్తోంది. ప్రభుత్వం అందిస్తున్న

2లో..

# బరితెగించిన సైబర్ క్రిమినల్స్

## - పోలీసు శాఖకు షాకిచ్చిన హ్యాకర్స్ - పోలీసు కమిషనరేట్ల వెబ్‌సైట్లు హ్యాక్




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బెట్టింగ్ యాప్స్‌పై యుద్ధం ప్రకటించి చర్యలు తీసుకుంటున్న తెలంగాణ పోలీసులకు సైబర్ నేరగాళ్లు సవాల్‌గా మారారు. ఏకంగా పోలీస్ వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసి అందులోనే బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేశారు. నెటిజన్లు, అవసరమైన వ్యక్తులు పోలీస్ వెబ్‌సైట్‌కు వెళ్లి ఏదైనా విభాగంపై క్లిక్ చేస్తే వెంటనే అది బెట్టింగ్ వెబ్‌సైట్‌లకు రీడైరెక్ట్ అయ్యింది. వెంటనే సమస్యను గుర్తించిన సైబర్ వింగ్ చర్యలు చేపట్టింది. సమస్యను పరిష్కరించింది. తెలంగాణ రాష్ట్ర పోలీస్ వెబ్‌సైట్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారు. అందులో ఏ విభాగంపై క్లిక్ చేసినా నేరుగా బెట్టింగ్ సైట్‌లకు రీ డైరెక్ట్ అయ్యేలా చేశారు. మెయిన్ వెబ్‌సైట్ ఆధారంగా మిగతా వెబ్‌సైట్‌లను కూడా నేరగాళ్ల తమ స్వాధీనంలోకి తీసుకున్నారు. కొన్ని రోజుల నుంచి హైదరాబాద్ పరిధిలోని పోలీస్ కమిషనరేట్ల వెబ్‌సైట్‌లు సరిగా పని చేయడం లేదు.

2లో..

# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

## - సామాన్యులకు ఉచిత ప్రవేశం

TELANGANA RISING GLOBAL SUMMIT

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరం, మిరా?న్‌పేటలో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ - 2025'ను నిర్వహించడానికి సర్వం సిద్ధం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, ఈ సదస్సును దావోస్ సమ్మిట్ తరహాలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ సదస్సు ద్వారా తెలంగాణ తన బ్రాండ్ ఇమేజ్‌ను ప్రపంచానికి చాటి చెప్పాలని భవిష్యత్ అభివృద్ధికి ప్రాజెక్టులు, వ్యూహాలను రూపొందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సమ్మిట్ డిసెంబర్ 8న ప్రారంభమవుతుంది. ప్రపంచవ్యాప్తంగా

2లో..

వర్షించని మేఘం, శ్రమించని మేధావి..

# ఉన్నా ఒకటే, లేకపోయినా ఒకటే

- జిల్లాలో పవన్ కల్యాణ్ పర్యటన
- జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశం
- రాష్ట్రాభివృద్ధికి కూటమి నాయకుల ఐక్యతే మూలం అని ఉద్ఘాటన



చిత్తూర్ (ప్రశ్న న్యూస్) కూటమిలోని మూడు పార్టీల నాయకుల ఐక్యతే రాష్ట్ర ప్రగతికి మూలమని, ఇదే స్ఫూర్తి మరో 15 ఏళ్ల పాటు కొనసాగితేనే సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా దిగజారిన వ్యవస్థలను తిరిగి నిలబెట్టేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. నాయకుల మధ్య చిన్న చిన్న కమ్యూనికేషన్ గ్యాప్‌లు ఉంటే కూర్చుని మాట్లాడుకుని పరిష్కరించుకోవాలని, క్షేత్రస్థాయిలో

2లో..

# ఎయిర్ బస్సును ఆదిలాబాద్‌కు తెస్తాం

చేవెళ్ల ప్రాజెక్టును చేపట్టి ఈ జిల్లా పంట పొలాలకు నీళ్లిస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. త్వరలోనే ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి ఆదిలాబాద్ జిల్లాకు విశ్వవిద్యాలయం మంజూరు చేస్తామని ప్రకటించారు. జిల్లాకు విశ్వవిద్యాలయం మంజూరు చేస్తామని దాన్ని ఎక్కడ పెట్టాలన్నది స్థలం ఎంపికను ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు చర్చించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఆ వర్సిటీని ఇంద్రవెల్లిలో పెట్టడమే కాకుండా దానికి కొమురం భీం విశ్వవిద్యాలయంగా నామకరణం చేస్తే మరింత బాగుంటుందని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

### రెండేళ్ల నుంచి ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదు

ప్రజలు తెచ్చుకున్న ప్రజా ప్రభుత్వం రెండేళ్లు పూర్తిచేసుకుంది. సంక్షేమం–అభివృద్ధి రెండు కళ్లుగా భావించి ముందుకు వెళు_న్నాం. రెండేళ్ల నుంచి ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఒక గంట కూడా సెలవు తీసుకోకుండా ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్నాను. చిన్న వయసులోనే అన్ని పదవులు కందిపుచ్చుకొని ఈ స్థాయికి రావడం తెలంగాణ ప్రజలు ఆశీర్వాదమే. 'ప్రజలకు మంచి చేయాలని నిరంతరం పనిచేస్తున్నాను. ప్రజలు ఓటును ఆయుధంగా మార్చి ప్రజాపాలన తెచ్చారు. అభివృద్ధిలో రాజకీయాలకు అతీతంగా పనిచేస్తాం. బీజేపీ నాయకులను అయినా కలుపుకొని వెళ్తాం. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా పనిచేస్తాను'అని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

### ఆదిలాబాద్‌కు ఎయిర్ బస్సును తీసుకొస్తా

'గత ప్రభుత్వం పదేళ్ల పాటు ప్రభుత్వ కార్యక్రమాలకు విపక్ష ఎమ్మెల్యేలను అనుమతించలేదు. సచివాలయంలో రాకుండా కూడా అడ్డుకున్నారు, అన్నీ గమినంచిన ప్రజలు ఓటును ఆయుధంగా మార్చి నిరంకుశ ప్రభుత్వాన్ని దింపారు, ప్రజా ప్రభుత్వాన్ని గెలిపించుకున్నారు'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. 'ప్రజల నమ్మకాన్ని ఎక్కడా వమ్ము చేయకుండా రాజకీయాలకు అతీతంగా పనిచేస్తున్నాను. ఏడాది తిరిగేలోపు ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయి. ఆదిలాబాద్‌లో ఇక నుంచి ఎర్రబస్సులు కాదు, ఎయిర్ బస్సును తీసుకొస్తా' అని సీఎం రేవంత్ రెడ్డి బహిరంగంగా ప్రకటించారు. 'రాష్ట్ర అభివృద్ధికి తెలంగాణ రైజింగ్–2047 డాక్యుమెంటరీ రూపొందించాం. పెట్టుబడులు సాధించే లక్ష్యంతో ఈనెల 8న, 9న గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నాం. త్వరలో మళ్లీ వస్తా ఒక రోజంగా ఉండి, సమీక్షలు చేసి సమస్యలు తెలుసుకొని అక్కడే పరిష్కరించి పోతా. ఆదిలాబాద్ అభివృద్ధి నాదే హామీ' అని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.

### కాళేశ్వరం కూలేశ్వరం అయ్యింది

'గత ప్రభుత్వం ప్రజా ధనాన్ని లూటీ చేసింది. కాళేశ్వరం పేరుతో కడితే అది కూలేశ్వరం అయింది. అది వాళ్ల ఇంట్లో మాత్రం కాసులు కురిపించింది. కేవలం కమీషన్ల కోసమే ప్రాజెక్టు నిర్మించి వేల కోట్లు దోచుకున్నారు'అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఏ ఉద్దేశంతో సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారో అందుకు భిన్నంగా రాష్ట్రంలో పదేళ్ల పాలన సాగింది. సోనియా గాంధీ కలలుగన్న తెలంగాణను త్వరలోనే తీర్చి దిద్దుతాం. అక్రమ సొమ్ముతో కల్వకుంట్ల కుటుంబంలో పైసల పంచాయితీ కొనసాగుతోంది. ప్రజల సొమ్ము తిన్నవాడేవడు బాగుపడలేదు'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.

### త్వరలో 40 వేల ఉద్యోగాలు చేపడతాం

'గడిచిన పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎవరికి న్యాయం జరగలేదు. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం తిరిగే లోపు 61 వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాం' అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేశాం అని చెప్పుకొచ్చారు. ప్రజా పాలన %–% ప్రజా విజయోత్సవ సంబరాలు ముగిన తర్వాత సమీక్ష నిర్వహించి మరో 40 వేల ఉద్యోగాల నియామకాల ప్రక్రియ చేపడుతాం. మొత్తంగా లక్ష ఉద్యోగాలను భర్తీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.

### పంచాయతీల్లో ఏకగ్రీవంగా ఎన్నుకోవాలి

పంచాయతీల్లో ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని ఎన్నికల్లో అడ్డంగా ఖర్చుపెట్టి ఇబ్బందుల పాలు కావద్దని సూచించారు. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని చెప్పుకొచ్చారు.

# 45 రోజుల్లోగా మెజార్టీ ఎంఓయూలు కార్యరూపం దాల్చాలి

ఆమోదం తెలిపింది. అలాగే విశాఖ భాగస్వామ్య సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాలపై సీఎం సమీక్షించారు. 20 రోజుల క్రితం విశాఖ భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తే ఇప్పటికే రూ.7.69 లక్షల కోట్ల విలువైన ఒప్పందాలు ఆచరణ దిశగా అడుగులు వేస్తున్నాయి. ఈ ఎంఓయూలు అన్నింటికీ ఏయే జిల్లాల్లో ఏర్పాటు చేయాలి, ఎక్కడెక్కడ భూములివ్వాలనే అంశంపైనా నిర్ణయాలు జరిగాయి. ఇక మిగిలిన ఎంఓయూలను వీలైనంత త్వరగా పట్టాలెక్కించాలి. 45 రోజుల్లోగా ఎంఓయూలు అన్నింటినీ గ్రౌండింగ్ అయ్యేలా చూడాలి. వీలైనన్ని ఎంఓయూలను గ్రౌండింగ్ చేసి, దావోస్ సదస్సుకు వెళ్తే మరిన్ని పెట్టుబడులను వస్తాయన్నారు. దావోస్ పర్యటనకు ముందే 75 ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపన జరిగేలా చూడాలి. ఎంఓయూల గ్రౌండింగ్‌పై ప్రతీ వారం సీఎస్ సమీక్షించాలని ఆదేశించారు. ఇక నుంచి ఎస్ఐపీబీతో పాటు ఎంఓయూలపైనా స్వయంగా సమీక్షిస్తాను. జిల్లా కలెక్టర్లు కూడా వీటిపై దృష్టి పెట్టాలి. ఇక పరిశ్రమలు గ్రౌండింగ్ అయ్యే విధానానికి సంబంధించి ఓ విధానాన్ని రూపొందించాలని సూచించారు. ఆమోదం పొందిన యూనిట్లు, పరిశ్రమలు నిర్దేశిత గడువులోగా ఏర్పాటు చేయాల్సిందే. దీనిపై అధికారులు ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలి. వివిధ రంగాల్లో ఏపీని అభివృద్ధి చేయాలని చూస్తున్నాం. అలాగే రాష్ట్రాన్ని నాలెడ్జ్ ఎకానమీగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈక్రమంలో ప్రభుత్వ యంత్రాంగం కూడా పూర్తిగా టెక్నాలజీపై గ్రిప్ పెంచుకోవాలన్నారు. లాజిస్టిక్స్ యూనివర్సిటీ, సివిల్ ఏవియేషన్ యూనివర్సిటీ, గ్రీన్ ఎనర్జీ యూనివర్సిటీ వంటివి ఏర్పాటు చేయాలి. క్వాంటం వ్యాలీకి అడ్వైజరీ బాడీని నియమించండి. మెంటరింగ్, మోనిటరింగ్, వెంచర్ క్యాపిటల్ కోసం ఇది పనిచేయాలి. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ అనేది స్టార్టప్‌లకు ఓ మెంటార్ గా వ్యవహరిస్తుంది. క్వాంటం వ్యాలీలో నిర్మించే 6 క్వాంటం టవర్లలో రెండు టవర్లను క్వాంటం అల్గారిథం డెవలప్మెంట్ కోసం మరో రెండు టవర్లు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డెవలప్మెంట్ కోసం కేటాయించాలని సూచించారు. ఏఐ బేసిక్స్‌ను 7 తరగతి నుంచే బోధించేలా చర్యలు చేపట్టండి. మైక్రోసాఫ్ట్, గుగూల్ లాంటి కంపెనీల సాయంతో బృందాన్ని ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు.

ప్రభుత్వ రంగ సంస్థలే వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టేలా చర్యలు తీసుకోవాలి. యూఏఈ, దుబాయ్, సహా మరికొన్ని దేశాల్లో ప్రభుత్వ రంగ సంస్థలు లక్షల కోట్ల రూపాయలతో సావరిన్ ఫండ్ ఏర్పాటు చేసుకున్నాయి. దీంతో ప్రభుత్వ కంపెనీలతోనే వివిధ రంగాల్లో పెట్టుబడులు పెడుతున్నారు. ఏపీ కూడా ఆ స్థాయికి రావాలి. రూ.500 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం సావరిన్ ఫండ్ ఏర్పాటు చేయాలి. ఇక ఎర్లీబర్డ్ ప్రోత్సాహకాల అవకాశాలను మిగతా వారికి కూడా అందించేలా అన్ని శాఖలూ చూడాలి. ఈ మేరకు ఎర్లీ బర్డ్ ప్రోత్సాహకాలపై వెసులుబాటు కల్పించేలా పాలసీని సడలించాలన్నారు.

### రాష్ట్రస్థాయి పెట్టుబడుల బోర్డు సమావేశంలో ఆమోదించిన కంపెనీల వివరాలు

- చింతా ఎనర్జీ–రూ. 8500 కోట్లు–5800 ఉద్యోగాలు
- గనేకో త్రీ ఎనర్జీ–రూ. 2140 కోట్లు–1000 ఉద్యోగాలు
- శ్రేష్ట రెన్యూవబుల్స్–రూ. 70 కోట్లు–339 ఉద్యోగాలు
- క్యూపై ఇండియా–రూ. 47 కోట్లు–9 ఉద్యోగాలు
- క్యూబైటెక్ స్మార్ట్ సొల్యూషన్స్–రూ. 15 కోట్లు–30 ఉద్యోగాలు
- క్యూక్త్రెర్ వాయన్స్ క్వాంటం ల్యాబ్స్–రూ. 14 కోట్లు–5–12 ఉద్యోగాలు
- సైబ్రా నెక్స్–రూ. 10 కోట్లు–10–15 ఉద్యోగాలు
- క్యూ బీట్స్–రూ. 37 కోట్లు–40 ఉద్యోగాలు
- సెనటల్లా ఏఐ థెరా ప్యూటిక్స్–రూ. 6 కోట్లు–40 ఉద్యోగాలు
- ఫార్టీటూ42 టెక్నాలజీ ఇన్నోవేషన్స్–రూ. 9 కోట్లు–5–8 ఉద్యోగాలు
- సిఫ్సా టెక్ ఇండియా–రూ. 1140 కోట్లు–1251 ఉద్యోగాలు
- శ్రీ తమ్మిన సాఫ్ట్వేర్ సొల్యూషన్స్–రూ. 62 కోట్లు –500 ఉద్యోగాలు
- ఏసీఎన్ హెల్త్ కేర్ ఆర్సీఎం–రూ. 30 కోట్లు–600 ఉద్యోగాలు
- నాౖటెల్ టెక్నాలజీస్–రూ. 50.67 కోట్లు–567 ఉద్యోగాలు
- పీవీఆర్ హస్పటాలిటీస్–రూ. 225 కోట్లు–1230 ఉద్యోగాలు
- మెగ్లాన్ లీజర్స్–రూ. 348 కోట్లు–1700 ఉద్యోగాలు
- యాగంటి ఎస్టేట్స్–రూ. 61 కోట్లు–250 ఉద్యోగాలు
- నాందీ హెూటల్స్–రూ. 150 కోట్లు–222 ఉద్యోగాలు
- రిలయెన్స్ కన్స్యూమర్ ప్రొడెక్ట్స్–రూ. 1622 కోట్లు–1200 ఉద్యోగాలు
- రామయాపట్నం కార్గో రెసిప్షన్ టెర్మినల్–రూ. 1615 కోట్లు–1300 ఉద్యోగాలు
- సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్–రూ. 45 కోట్లు–300 ఉద్యోగాలు
- టీజీవి ఎస్ఆర్ఏఏసీ –రూ. 1216 కోట్లు–400 ఉద్యోగాలు
- శ్రీ వెంకటేశ్వర బయోటెక్–రూ. 122 కోట్లు–184 ఉద్యోగాలు
- ఎమర్జ్ గ్లాస్ ఇండస్ట్రీస్–రూ. 182 కోట్లు–415 ఉద్యోగాలు
- జీయట్ ఎనర్జీస్–రూ. 305 కోట్లు–300 ఉద్యోగాలు
- రామన్ సింగ్స్ గ్లోబల్ ఫుడ్ పార్క్–రూ. 141 కోట్లు–600 ఉద్యోగాలు
- గాయత్రి రెన్యూవబుల్ ఫ్యూయల్స్–రూ. 320 కోట్లు–700 ఉద్యోగాలు
- మల్లాది డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్–రూ. 343 కోట్లు–355 ఉద్యోగాలు
- విరూపాక్ష ఆర్గానిక్స్–రూ. 1225 కోట్లు–1500 ఉద్యోగాలు
- రాముకా గ్లోబల్ ఎకో వర్క్స్–రూ. 193 కోట్లు–426 ఉద్యోగాలు
- మాస్ ఫ్యాబ్రిక్ పార్క్–రూ. 200 కోట్లు–35000 ఉద్యోగాలు

## ప్రతిభకు ఆర్థిక ఇబ్బందులు అడ్డురాకూడదు

ఈ ప్రోత్సాహం కారణంగా సివిల్ సర్వీసెస్ వైపు అభ్యర్థుల ఆసక్తి, విజయం గణనీయంగా పెరిగింది. గత సంవత్సరం 20 మంది అభ్యర్థులు మాత్రమే ఇంటర్వ్యూ దశకు చేరుకోగా ఈ సంవత్సరం ఈ సంఖ్య 50 మందికి పెరిగింది. అంటే కేవలం ఏడాదిలోనే విజయం రెట్టింపునకు పైగా పెరిగింది. ఇంటర్వ్యూకు సిద్ధమయ్యే అభ్యర్థులకు సీనియర్ అధికారులతో కూడిన ప్రత్యేక ఇంటర్వ్యూ బోర్డు ఏర్పాటు చేసి మార్గదర్శకత్వం అందిస్తున్నారు. ఇంటర్వ్యూ సమయంలో అభ్యర్థులకు ఢిల్లీలో వసతి, పూర్తి సహాయ సహకారాలు అందించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. తాజాగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేతుల మీదుగా 50 మంది చెక్కులను అందుకున్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ సందర్భంగా అభ్యర్థులను అభినందించారు. ఈ ప్రోత్సాహం తెలంగాణ ప్రజలు కష్టపడి చెల్లించిన పన్నుల నుంచి వస్తున్నందున సివిల్ సర్వెంట్లుగా సమాజానికి జవాబుదారీగా ఉండాలని వారికి సూచించారు. "సివిల్ సర్వెంట్లుగా మీ సంతకం ప్రజల జీవితాలను మార్చగలగాలి. మీ విజయం తెలంగాణ బలాన్ని, ప్రతిభను ప్రతిబింబించాలి" అని ఆయన సీఎం ఉద్ఘాటించారు. సింగరేణి సీఎండీ ఎన్. బలరాం (ఐఆర్ఎస్) మాట్లాడుతూ ఈ పథకం అభ్యర్థులు ఆర్థిక ఒత్తిడి లేకుండా ప్రిపరేషన్‌పై దృష్టి సారించేందుకు ఎంతగానో ఉపయోగపడుతోందని తెలిపారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి సింగరేణి బ్రాండ్ శాలువా, సింగరేణి మెమొంటోను ఆవిష్కరించారు. ఇవి తెలంగాణ సంస్కృతి మరియు అభివృద్ధిని ప్రతిబింబిస్తాయి.

## 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు బాలీవుడ్ గ్లామర్

**– హాజరుకానున్న సల్మాన్, అజయ్ దేవగణ్**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు బాలీవుడ్ తారల మెరుపులు తోడవనున్నాయి. డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్ వేదికగా జరిగే ఈ సదస్సుకు ప్రముఖ నటులు సల్మాన్ ఖాన్, అజయ్ దేవగణ్ హాజరుకానున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వీరిద్దరూ ఆసక్తి చూపడం గమనార్హం. హైదరాబాద్‌ను గ్లోబల్ పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చడమే లక్ష్యంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం జరగనున్న భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రపంచస్థాయి ఫిల్మ్ స్టూడియోలను ఏర్పాటు చేయాలని సల్మాన్ ఖాన్ యోచిస్తున్నారు. ఈ విషయంపై ఆయన అక్టోబర్ 30న ముంబైలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు. తెలంగాణ సాధిస్తున్న అభివృద్ధిని ప్రశంసించిన సల్మాన్, రాష్ట్ర ప్రతిష్టను ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేస్తానని హామీ ఇచ్చారు. మరోవైపు, నటుడు, నిర్మాత అజయ్ దేవగణ్ కూడా హైదరాబాద్‌లో అత్యాధునిక ఫిల్మ్ స్టూడియో, ఫిల్మ్ సిటీని అభివృద్ధి చేసేందుకు తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకోనున్నట్లు తెలుస్తోంది. యానిమేషన్, వీఎఫ్ఎక్స్, ఏఐ ఆధారిత స్మార్ట్ స్టూడియోల ఏర్పాటుతో పాటు ఫిల్మ్ ఇండస్ట్రీకి అవసరమైన నిపుణులను తయారుచేసేందుకు ఒక నైపుణ్యాభివృద్ధి సంస్థను కూడా నెలకొల్పాలని ఆయన భావిస్తున్నారు. ఈ ఏడాది జులైలో ఆయన ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అయి తన ప్రణాళికలను వివరించారు.

## వర్షించని మేఘం, శ్రమించని మేధావి.. ఉన్నా ఒకటే, లేకపోయినా ఒకటే

ప్రజల గొంతుకగా మారాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం చిత్తూరు రెడ్డిగుంట వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "వర్షించని మేఘం, శ్రమించని మేధావి ఉన్నా ఒకటే, లేకపోయినా ఒకటే.

అలాగే, కూటమి ప్రభుత్వానికి ఇంతటి ప్రజాబలం ఉండి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవస్థల్లో మార్పులు తేలేకపోతే మన పదవులన్నీ నిష్ప్రయోజనమే" అని అన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో సమూల మార్పుల కోసమే రాష్ట్రవ్యాప్తంగా 77 డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయాలు ప్రారంభించామని వివరించారు. ఏళ్ల తరబడి ప్రమోషన్లకు నోచుకోని 10 వేల మంది పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించామని గుర్తుచేశారు. "ఒక ప్రభుత్వ ఉద్యోగి కొడుకుగా నాకు పదోన్నతి విలువ తెలుసు. అందుకే ఎలాంటి పైరవీలకు తావు లేకుండా, కేవలం అర్హత ఆధారంగానే ఉద్యోగులకు పదోన్నతులు ఇచ్చాం" అని ఆయన స్పష్టం చేశారు.

### మన ఐక్యతే రాష్ట్రానికి బలం

కూటమిలోని మూడు పార్టీలకు విభిన్న భావజాలాలు ఉన్నప్పటికీ... రాష్ట్రం బాగుండాలి–అరాచకాలు ఉండకూడదు అనే ఉమ్మడి లక్ష్యంతో అందరం ఒక గొడుగు కిందకు చేరామని పవన్ అన్నారు. "మన మధ్య చిన్న చిన్న మనస్పర్థలు, కమ్యూనికేషన్ గ్యాప్‌లు సహజం. కూర్చుని మాట్లాడుకుంటే అన్నీ పరిష్కారమవుతాయి.

చిన్నగా మొదలైన మన కూటమి, ఈరోజు కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో బలమైన శక్తిగా నిలిచింది. మన ఐక్యత వల్లే నామినేటెడ్ పదవులు ఇవ్వగలుగుతున్నాం. ఇదే ఐక్యతతో మరో 15 ఏళ్లు శ్రమిస్తే రాష్ట్రానికి సుస్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుంది" అని ఆయన పేర్కొన్నారు.

### పదవి బాధ్యత, అలంకారం కాదు

గత ప్రభుత్వ పాలనను ప్రస్తావిస్తూ, "శేషాచలం అడవులను అడ్డగోలుగా దోచేశారు. ఇప్పటివరకు దొరికింది కేవలం 10 శాతం సంపదే. దాని విలువే వేల కోట్లు ఉంటే, ఇక దొరకని సంపద విలువ ఎంత ఉంటుందో ఊహించుకోవచ్చు.

ఇలాంటి అవినీతిని అరికట్టి, బలహీనుల గొంతుకగా మనం నిలవాలి" అని పిలుపునిచ్చారు. నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబునే ఒక నియోజకవర్గంలో అడుగుపెట్టనివ్వబోమని గత పాలకులు బెదిరించారని, పంచాయతీ ఎన్నికల్లో ప్రజలను భయపెట్టి ఏకగ్రీవాలు చేయాలని చూశారని విమర్శించారు. అలాంటి పరిస్థితుల్లోనూ జనసేన కార్యకర్తలు ప్రాణాలకు తెగించి నిలబడ్డారని అభినందించారు.

"సమాజంలో కోల్పోయిన ధైర్యాన్ని నింపడమే జనసేన లక్ష్యం. కష్టపడిన ప్రతి కార్యకర్తను గుర్తుపెట్టుకుని గౌరవిస్తాం. గ్రామ స్థాయి నుంచి లోక్‌సభ నియోజకవర్గం వరకు ఐదుగురు సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేస్తాం" అని హామీ ఇచ్చారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ 'స్వచ్ఛరథాల'ను పరిశీలించారు. తిరుచానూరు, కరకంబాడి పంచాయతీల నుంచి తెప్పించిన ఈ వాహనాల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, అరణి శ్రీనివాసులు, కె. మురళీమోహన్, అరవ శ్రీధర్, ఏపీ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో రష్యా అధ్యక్షుడు పుతిన్

ఐఎల్–96 ద్వారా పాలమ్ ఎయిర్‌బేస్‌లో ల్యాండ్ అయ్యారు. విమానం రన్‌వేలో ఉన్నప్పుడే ప్రధానమంత్రి మోదీ ఎయిర్‌పోర్ట్‌లో ఉండి, గార్డ్ ఆఫ్ ఆనర్‌తో స్వాగతం పలికారు. రష్యన్ ఫ్లాగ్‌తో కూడిన గార్డ్ ఆఫ్ ఆనర్, జాతీయ గీతాల మధ్య పుతిన్ విమానం నుంచి దిగి, మోదీతో కరచాలనం చేశారు. భారత్–రష్యా సన్నిహిత సంబంధాలు మరింత బలపడతాయి అని మోదీ ట్విటర్‌లో పోస్ట్ చేశారు. పుతిన్ ఎయిర్‌పోర్ట్‌లో భారత ఉన్నతాధికారులతో కొంతసేపు మాట్లాడారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ వంటి నాయకులు కూడా ఉన్నారు. ఎయిర్‌పోర్ట్ నుంచి ఐటీసీ మౌర్యా హెూటల్ వరకు పుతిన్ మోటార్‌కేడ్‌లో ప్రయాణించారు. ఒకే కారులో మోదీ, పుతిన్ ప్రయాణించడం ఆకర్షించింది. రక్షణ ఒప్పందాలు బ్రహ్మోస్ మిస్సైల్ అప్‌గ్రేడ్, ఎస్–500 డిఫెన్స్ సిస్టమ్ , వాణిజ్య లక్ష్యాలు 2025కి 50 బిలియన్ డాలర్ల ట్రేడ్, రష్యా నుంచి అదనపు ఆయిల్ సప్లైలు, బ్రిక్స్ విస్తరణపై చర్చలు జరిగే అవకాశం ఉంది. డిన్నర్ తర్వాత రెండు దేశాలు 10 ఎంఓయూలపై సంతకాలు చేయనున్నాయి. రక్షణ రంగంలో రూ. 30,000 కోట్ల విలువైన డీల్స్ జరగనున్నాయి. భారత్, రష్యా సుదీర్ఘ కాలంగా స్నేహితులు. అయితే మారుతున్న పరిస్థితులతో ఈ పర్యటన మరింత ఆసక్తికరంగా మారింది.

## మేము వచ్చాక హిల్ట్ పాలసీ రద్దు

కమర్షియల్ కాంప్లెక్స్ లు కట్టుకోమని పారిశ్రామిక భూములను ఇస్తున్నదని.. ప్రభుత్వం చెబుతున్నట్లు అవి ప్రైవేటు వ్యక్తుల భూములు కావు ప్రైవేట్ వ్యక్తులకు ప్రజలు ప్రభుత్వం ఇచ్చిన భూములన్నారు. అందులో కేవలం పరిశ్రమలు పెట్టి ఉపాధి కల్పించాలన్న నిబంధనలతోనే ఆ భూములను ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. లక్షన్నర రూపాయలకు గజం ధర మార్కెట్లో పలుకుతుంటే కేవలం 4000 రూపాయలకు ప్రవేట్ వ్యక్తులకు అప్పచెప్తున్నదని.. హైదరాబాద్ నగరంలో ఇండ్లకు పాఠశాలలకు ఆసుపత్రులకు చివరికి స్మశానాలకు స్థలం లేదు కానీ ప్రైవేట్ వ్యక్తులకు 9300 ఎకరాల భూమిని ప్రభుత్వం అప్పనంగా ఇస్తామంటున్నదని మండిపడ్డారు. ఈ తొమ్మిది వేల 300 ఎకరాల భూములను తిరిగి వెనక్కి తీసుకొని అక్కడ కాంగ్రెస్ చెప్తున్నా ఇందిరమ్మ ఇండ్లు యంగ్ ఇండియా స్కూల్స్ ఆసుపత్రులు కట్టాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ నగరంలో స్థలం లేదని చెప్పి ఇప్పటిదాకా ఒక్క ఇందిరమ్మ ఇల్లు కూడా కాంగ్రెస్ కట్టలేదని గుర్తు చేశారు. ఇక్కడ ఉన్న కంపెనీలు తరలి వెళ్తే హైదరాబాద్ నగరంలో వాటిపైన ఆధారపడిన లక్షల మంది ఉపాధి పోతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఈ కుంభకోణాన్ని ప్రజల కి వివరించేందుకే ఈరోజు పారిశ్రామిక వాడల్లో పర్యటిస్తున్నామని, కాంగ్రెస్ పార్టీ ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తున్న భూముల ధర నిర్ధారణ దాని వెనుక ఉన్న అసలు నిజాలు నిర్ధారణ జరగాలన్న ఉద్దేశంతోనే ఈ పర్యటనలు చేస్తున్నామన్నారు. ఈ అంశాన్ని ఇక్కడితో మా పార్టీ వదిలిపెట్టదని కాంగ్రెస్ పార్టీ హిల్ట్ పాలసీ కుంభకోణం పైన త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. నగరంలో కాలనీలలో ప్రజలకు ఈ అంశాన్ని వివరిస్తాము రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ సమావేశాలు నిర్వహిస్తాము ప్రజా సంఘాలు ప్రతిపక్ష పార్టీలను కలుపుకొని ముందుకు పోతామని ప్రకటించారు. ఈ పాలసీని వెనక్కి తీసుకొని లక్షల కోట్ల ప్రజల భూమిని కాపాడే దాకా మా పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. మా ప్రభుత్వం రాగానే ఈ పాలసీది రద్దు చేస్తాము అవసరమైతే ఇందుకోసం ఒక చట్టాన్ని తీసుకువస్తాము, ఈరోజు రేవంత్ రెడ్డి భూ కుంభకోణంలో భాగస్వాములు కావద్దని పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఎవరైనా అత్యాశకు వెళ్లి ప్రభుత్వానికి డబ్బులు కడితే అటు పారిశ్రామిక భూములతో పాటు డబ్బులు కూడా పోతాయి అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఇంతటి భారీ కుంభకోణాన్ని దోపిడీని చూసి తట్టుకోలేక తెలంగాణ పట్ల ప్రేమ ఉన్న తెలంగాణ బిడ్డ మాకు సమాచారం ఇచ్చారని ప్రభుత్వం చేస్తున్న దోపిడీ పైన మేము అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా సమాచారం లీక్ అయింది అంటూ బాధపడుతున్నదన్నారు. చిత్తశుద్ధి ఉంటే తమ ప్రభుత్వం చేస్తున్న దోపిడీ పైన ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.

### ఎన్నికల ప్రక్రియ, రిజర్వేషన్‌లలో జోక్యం చేసుకోలేం

కేటాయించారని పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. 2011 జనాభా లెక్కల ప్రకారం సర్పంచ్ రిజర్వేషన్లు కేటాయించడంలో పొరపాట్లు జరిగాయని వారు పేర్కొన్నారు. రిజర్వేషన్లు కేటాయించిన చోట సంబంధిత కులాల వ్యక్తులు లేకపోతే ఎన్నికలు నిర్వహించబోమని ఎన్నికల సంఘం కోర్టుకు తెలియజేసింది. ఎన్నికల సంఘం చేసిన వాదనలను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. అనంతరం పిటిషన్లపై విచారణను ముగించింది.

## రైతుల పరిస్థితి చూస్తుంటే 'సేవ్ ఏపీ' అనాల్సి వస్తోంది

తూర్పారబట్టారు. రైతు సంతోషంగా ఉంటేనే రాజ్యం సంతోషంగా ఉంటుందని జగన్ అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో రైతులకు ఉచిత పంటల బీమాను ఒక హక్కుగా అందించామని, దీని కింద రూ.7,800 కోట్లు చెల్లించామని గుర్తుచేశారు. కానీ, ప్రస్తుత ప్రభుత్వం ఉచిత పంటల బీమాకు ఉరి వేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో 84 లక్షల మంది రైతులుంటే కేవలం 19 లక్షల మందికి మాత్రమే బీమా సౌకర్యం కల్పించారని పేర్కొన్నారు. రూ.1,100 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ బకాయిలు పేరుకుపోయాయని, వాటిని ఎప్పుడు చెల్లిస్తారో ప్రభుత్వం చెప్పడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల ముందు పెట్టుబడి సాయం కింద ఏటా రూ. 20,000 ఇస్తామని హామీ ఇచ్చి, రెండేళ్లలో రూ. 40,000కు బదులుగా కేవలం రూ. 10,000 మాత్రమే ఇచ్చారని జగన్ దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఏ పంటకూ గిట్టుబాటు ధర లభించడం లేదని, దళారులు రైతులను దోచుకుంటున్నా ప్రభుత్వం చోద్యం చూస్తోందని మండిపడ్డారు. మొంథా తుపాను విషయంలో ప్రభుత్వం హడావుడి చేసిందని, ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప రైతులకు చేసిందేమీ లేదని విమర్శించారు. ప్రజలకు వాస్తవాలు తెలియాలనే ఉద్దేశంతోనే ఈ విషయాలు వెల్లడిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

500 కంటే ఎక్కువ పెద్ద కంపెనీలు, 2,000 పైగా వ్యాపారవేత్తలు, అంతర్జాతీయ నాయకులు, నిపుణులు ఈ సదస్సుకు హాజరవుతారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ సదస్సులో జరిగే ముఖ్య కార్యక్రమాల్లో రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దే మెగా ప్రాజెక్టులు, పారిశ్రామిక విధానాలు, మౌలిక సదుపాయాల గురించి నిపుణులతో లోతైన చర్చా గోష్ఠులు ఉంటాయి. ప్రభుత్వ శాఖల పనితీరు, ప్లాన్లు, పథకాలను వివరించే స్టాల్స్ ఏర్పాటు చేస్తారు. వివిధ రంగాల నిపుణులతో ముఖా ముఖి సంభాషణలు, చర్చా వేదికలు ఉంటాయి. ప్రపంచ స్థాయి ప్రతినిధులను ఆహ్వానిస్తున్న ఈ సదస్సులో భారత భిన్న సాంస్కృతిక, కళారూపాలతో అతిథులను అలరించనున్నారు. ముఖ్యంగా ఆస్కార్ అవార్డు గ్రహీత, ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి డిసెంబర్ 8న ప్రారంభోత్సవంలో 90 నిమిషాల పాటు తన సంగీత కచేరితో అతిథులను అలరించనున్నారు. ప్రముఖ వీణా విద్వాంసురాలు జయలక్ష్మీ వీణా కార్యక్రమం, కళాకృష్ణ ఆధ్వర్యంలో పేరణి నాట్యం ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

అలాగే.. ప్రఖ్యాత ఇంద్రజాల మాంత్రికుడు సామల వేణు తన ప్రదర్శనతో ప్రేక్షకులను ఆకట్టుకోనున్నారు. రాష్ట్ర సంస్కృతిని ప్రతిబింబించేలా కొమ్ము కోయ, బంజారా, కోలాటం, గుస్సాడి, ఒగ్గు డోలు, మహిళల డప్పులు, పేరణి నృత్యం, బోనాల కోలాటం వంటి ప్రజా కళారూపాలతో అతిథులను ఆత్మీయంగా ఆహ్వానించనున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు శుభవార్త చెబుతూ డిసెంబర్ 10 నుంచి 13 వరకు ఈ సమ్మిట్‌కు సామాన్యులకు సైతం ఉచిత ప్రవేశం కల్పించింది. ఈ తేదీల్లో ప్రజలందరూ ఈ వేడుకలను సందర్శించవచ్చు. ఈ నాలుగు రోజులు రోజంతా మ్యూజికల్ ఆర్కెస్ట్రా నిర్వహిస్తారు. సామాన్యుల సౌలభ్యం కోసం, ప్రభుత్వం ప్రతిరోజూ ఎంజీబీఎస్, జేబీఎస్, కూకట్‌పల్లి, చార్మినార్, ఎల్‌బీ నగర్ వంటి ముఖ్య ప్రాంతాల నుండి ప్రత్యేక ఉచిత బస్సు సేవలను ఏర్పాటు చేసింది. ఈ సౌకర్యంతో ప్రజలు ఎలాంటి ఇబ్బంది లేకుండా సమ్మిట్‌ను సందర్శించవచ్చు.

## బరితెగించిన సైబర్ క్రిమినల్స్

టెక్నికల్ టీం దీన్ని రెక్టిఫై చేయడానికి ప్రయత్నించింది. ఇంతలో సైబర్ నేరగాళ్లు తమ టాలెంట్ చూపించారు. సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల వెబ్‌సైట్‌లను ఓపెన్ చేయడానికి ప్రయత్నిస్తే నేరుగా బెట్టింగ్ సైట్‌లు ఓపెన్ అవుతున్నాయి. వివిధ వర్గాల నుంచి ఫిర్యాదులు అందుకున్న ఐటీ విభాగం వెంటనే చర్యలు ప్రారంభించింది. సర్వర్ నుంచి వెబ్‌సైట్ ను హ్యాక్ చేశారని గుర్తించారు. అందుకే మెయిన్ సర్వర్‌ను డౌన్ చేసి సమస్యను పరిష్కరించారు. తర్వాత వెబ్‌సైట్‌లను పునరుద్ధరించారు. అందులో ఉన్న భద్రతా లోపాలను కూడా సవరించారు. పోలీస్ వెబ్‌సైట్ హ్యాక్, ఇతర వెబ్‌సైట్‌లలో బెట్టింగ్ యాప్స్‌వెబ్‌సైటలకు రీడైరెక్ట్ అవ్వడంపై పోలీసులు ఇంత వరకు స్పందించలేదు. దీనిపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది. చాలా కాలంగా బెట్టింగ్ యాప్స్‌పై తెలంగాణ పోలీసులు విచారణ చేస్తున్నారు. యాప్స్‌ను ప్రమోట్ చేసిన వారిని పిలిచి విచారిస్తున్నారు. ఈ బెట్టింగ్ యాప్స్ వలలో పడిన అమాయకులు ప్రాణాలు తీసుకుంటున్నారని గ్రహించి పోలీస్ శాఖ చర్యలు ప్రారంభించింది. ఇప్పుడు వారి వెబ్‌సైట్‌నే హ్యాక్ చేసి బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసి సైబర్ నేరగాళ్లు వారికి సవాల్ చేశారు. దీనిపై పోలీస్ శాఖ రియాక్షన్ ఎలా ఉంటుందో చూడాలి.

# 'సుస్థిరాభివృద్ధి' సిద్ధాంతము- ఆచరణ

సుస్థిరాభివృద్ధి అనేది ఆధునిక ప్రపంచంలో అత్యంత చర్చనీయాంశమైన భావన. ఇది కేవలం పర్యావరణ పరిరక్షణకు సంబంధించినది మాత్రమే కాదు. ఆర్థిక, సామాజిక, పర్యావరణ రంగాలను సమతుల్యంగా కలిపి, ప్రస్తుత తరం అవసరాలను తీర్చుతూ భవిష్యత్ తరాలకు అవకాశాలను కాపాడుకోవడం. బ్రండ్‌లాండ్ కమిషన్ నివేదికలో మొదటిసారి స్పష్టంగా నిర్వచించబడిన ఈ భావన, ఇప్పుడు ఐక్యరాష్ట్ర సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల (ఎస్.డీ.జీ.ఎస్.) రూపంలో ప్రపంచవ్యాప్తంగా అమలవుతోంది. అయితే, ఈ భావన యొక్క లక్షణాలు మరియు వ్యూహాలను విశ్లేషించి, విమర్శనాత్మకంగా పరిశీలిస్తే, ఇది ఒక ఆదర్శవాద దృక్పథం మాత్రమే కాకుండా, వాస్తవిక సవాళ్లతో కూడిన సంక్లిష్ట ప్రక్రియగా తెలుస్తుంది. మూడు ప్రధాన స్తంభాలపై ఆధారపడి ఉంటాయి. అవి ఆర్థిక, సామాజిక అలాగే పర్యావరణ సంబంధిత అంశాలు. ఆర్థిక స్తంభం సమర్థవంతమైన వనరుల వినియోగం, ఆవిష్కరణలు, స్థిరమైన వృద్ధిని నొక్కి చెబుతుంది. ఉదాహరణకు, ఆర్థిక వృద్ధి, పేదరిక నిర్మూలనను సమన్వయం చేయడం ద్వారా, దేశాలు దీర్ఘకాలిక సమృద్ధిని సాధించవచ్చు. సామాజిక స్తంభం సమానత్వం, విద్య, ఆరోగ్యంతోపాటు... మానవ హక్కులను ప్రోత్సహిస్తుంది. ఇది సమాజంలో అసమానతలను తగ్గించడానికి ఉద్దేశించబడింది. పర్యావరణ స్తంభం జీవవైవిధ్యం, వాతావరణ మార్పులు, వనరుల పునరుద్ధరణపై దృష్టిని సారిస్తుంది. ఈ మూడు స్తంభాలు పరస్పరం అనుసంధానితమై ఉండటం ఈ భావన యొక్క ప్రత్యేకత. అయితే, విశ్లేషణాత్మకంగా చూస్తే, ఈ లక్షణాలు ఆచరణలో సంఘర్షణలు సృష్టిస్తాయి. ఉదాహరణకు, ఆర్థిక వృద్ధి కోసం పారిశ్రామికీకరణ అవసరం అవుతుంది. అయితే పారిశ్రామీకరణ పర్యావరణానికి హాని కలిగిస్తుంది. అలాగే, సామాజిక సమానత్వం కోసం ప్రయత్నాలు ఆర్థిక ఖర్చులను పెంచుతాయి. ఇది సుస్థిరత యొక్క ఆదర్శవాద స్వభావాన్ని ప్రశ్నిస్తుంది %-%ఈ సుస్థిరాభివృ నిజంగా సాధ్యమా, లేదా కేవలం రాజకీయ రెటారిక్ మాత్రమేనా? ఇక వ్యూహాల విషయానికి వస్తే, సుస్థిరాభివృద్ధిని సాధించడానికి ప్రపంచవ్యాప్తంగా అనేక వ్యూహాలు అమలవుతున్నాయి. ముందుగా, పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం. సౌర, పవన, జలవిద్యుత్ వంటివి,కార్బన్ ఉద్గారాలను తగ్గించడానికి కీలక పాత్ర పోషిస్తుంది. యూరోపియన్ యూనియన్ యొక్క గ్రీన్ డీల్ వంటి కార్యక్రమాలు ఈ వ్యూహాన్ని ఉదాహరణగా చూపుతాయి. రెండవది, సర్క్యులర్ ఎకానమీ మోడల్, ఇక్కడ వ్యర్థాలను పునర్వినియోగం చేసి, వనరులను ఆదా చేస్తారు. ఇది సాంప్రదాయ లీనియర్ ఎకానమీ (తయారు-వినియోగం-విస్మరణ) నుండి మార్పును సూచిస్తుంది. మూడవది, సుస్థిర వ్యవసాయం. ఆర్గానిక్ ఫార్మింగ్, నీటిని సమర్థ వంతంగా వినియోగం, జీవవైవిధ్య పరిరక్షణ, ఆహార భద్రతను బలోపేతం చేయటం మొదలైన కార్యక్రమాలు ఉంటాయి.అదనంగా, విద్య,వికాస అవగాహన కార్యక్రమాలు, పాలసీ ఫ్రేమ్‌వర్క్‌లు వంటివి సమాజాన్ని సుస్థిరత వైపు నడిపిస్తాయి. ఐక్యరాష్ట్ర సమితి యొక్క 17 (ఎస్.డీ.జీ.ఎస్) పేదరిక నిర్మూలన నుండి వాతావరణ పరిరక్షణ చర్య వరకు... ఈ వ్యూహాలకు మార్గదర్శకాలుగా ఉంటాయి. విశ్లేషణాత్మకంగా, ఈ వ్యూహాలు సమస్యలను పరిష్కరించడంలో సమర్థవంతమైనవి కావచ్చు. కానీ, అవి దేశాల మధ్య అసమానతలను పరిగణనలోకి తీసుకోవు. అభివృద్ధి చెందుతున్న దేశాలు ఆర్థిక వృద్ధి కోసం పర్యావరణాన్ని త్యాగం చేయవలసి వస్తుంది, ఇది సుస్థిరత యొక్క సార్వత్రికతను ప్రశ్నిస్తుంది. విమర్శనాత్మక దృక్పథంతో చూస్తే, సుస్థిరాభివృద్ధి లక్షణాలు,వాటి వ్యూహాలు అనేక లోపాలతో కూడి ఉన్నాయి. ముందుగా, (ఎస్.డీ.జీ.ఎస్.) లో అంతర్గత అసంగతతలు ఆర్థిక వృద్ధి (ఎస్.డీ.జీ.- 8) మరియు పర్యావరణ పరిరక్షణ (ఎస్.డీ.జీ.-13) మధ్య సంఘర్షణ అమలును కష్టతరం చేస్తున్నాయి. ఒక విశ్లేషణ ప్రకారం, ఈ లక్ష్యాలు సామాజిక, ఆర్థిక, పర్యావరణ స్తంభాల మధ్య సమతుల్యతలు లోపిస్తాయి. ఇది ప్రపంచ దేశాలలో అసమాన ప్రగతిని కలిగిస్తుంది. ఉదాహరణకు, చైనా,ఇండియా వంటి దేశాలు బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ ద్వారా సుస్థిరతను ప్రకటిస్తున్నప్పటికీ, వాస్తవంలో పర్యావరణ హాని,అలాగే రుణ ఉచ్చులు పెరుగుతున్నాయి. రెండవది, గ్రీన్‌వాషింగ్, కంపెనీలు తమ ఉత్పత్తులను సుస్థిరంగా చూపించి, వాస్తవంలో పర్యావరణాన్ని దోపిడీ చేయడం మొదలు పెట్టాయి. ఈ భావనను బలహీనపరుస్తుంది. కార్పొరేట్ లాబీయింగ్.. రాజకీయ ఇచ్ఛా శక్తి లోపం కారణంగా, వ్యూహాలు కేవలం కాగితంపైనే మిగిలిపోతాయి. మూడవది, డేటా సవాళ్లు కూడా సుస్థిరత పనితీరును కొలవడంలో ఖచ్చితత్వం లోపించటం జరుగుతుంది. ప్రత్యేకించి వాతావరణ మార్పులు, అలాగే అసమానతల విషయంలో. ఒక అధ్యయనం ప్రకారం, ఈ డేటా లోపాలు నిజమైన ప్రగతిని మూల్యాంకనం చేయటంలో ఇబ్బందులు కలగజేస్తాయి. అంతేకాకుండా, అభివృద్ధి చెందిన దేశాలు తమ బాధ్యతలను అభివృద్ధి చెందుతున్న దేశాలపై నెట్టడం ఒక రివాజుగా మారింది. సుస్థిరత అనేదో ఒక ఉత్తర-దక్షిణ వివాదంగా మారుతుంది. ఉదాహరణకు, పారిస్ ఒప్పందం ఉద్గారాల తగ్గింపు లక్ష్యాలు అభివృద్ధి చెందిన దేశాలకు సులభమైనవి కావచ్చు. కానీ, భారత్ వంటి అభివృద్ధి చెందే దేశాలకు ఆర్థిక భారం అవుతుంది. ఈ విమర్శలు సుస్థిరాభివృద్ధిని ఒక ఆదర్శవాద భ్రమగా, చేరుకోలేని లక్ష్యాలుగా చూపుతాయి. ఇక్కడ వాస్తవిక రాజకీయ, ఆర్థిక శక్తులు ఆధిపత్యం చేస్తాయి. అయినప్పటికీ, సుస్థిరాభివృద్ధి లక్షణాలు, వ్యూహాలు పూర్తిగా విఫలమైనవిగా భావించి లేము. విశ్లేషణాత్మకంగా పరిశీలించి చూస్తే, మల్టీ-మెట్రిక్ ఫ్రేమ్‌వర్క్‌లు, సిస్టమ్ డైనమిక్స్ వంటి పద్ధతులు ఈ సవాళ్లను పరిష్కరించడానికి సహాయపడతాయి. ఉదాహరణకు, ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ మోడల్స్ ద్వారా, దేశాలు తమ వ్యూహాలను స్థానిక అవసరాలకు అనుగుణంగా మార్చవచ్చు. కానీ ఇది రాజకీయ ఇచ్ఛా శక్తి అలాగే అంతర్జాతీయ సహకారంపై ఆధారపడి ఉంటుంది.

భవిష్యత్‌లో, సుస్థిరతను మరింత సమగ్రంగా చేయడానికి, డేటా ఆధారిత విశ్లేషణలు మరియు మల్టీ-క్రైటీరియా డెసిషన్ మేకింగ్ (ఎం.సీ.డీ.ఎమ్.) వంటి సాధనాలు అవసరం ఉంటుంది. ఇది సుస్థిరాభివృద్ధిని కేవలం లక్ష్యాల సమూహం నుండి ఒక డైనమిక్ ప్రక్రియగా మారుస్తుంది. అయితే, ఇప్పటికీ, ఈ భావన యొక్క స్వరూపం, స్వభావాలను విమర్శనాత్మకంగా పరిశీలన చేయటం అవసరం. ఇది నిజమైన మార్పును తీసుకురావాలంటే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో శక్తి అసమానతలను సవాలు చేయాలి. చివరిగా, సుస్థిరాభివృద్ధి ఒక అవసరమైన దృక్పథం, కానీ దాని లక్షణాలు మరియు వ్యూహాలు వాస్తవిక ఆచరణలో విమర్శలతో మెరుగుపరచాలి. లేకుంటే, ఇది కేవలం ఒక భ్రమ మాత్రమే అవుతుంది.

# ప్రజాసేవలో మేటిదిరారెవరూ ఆయనకు సాటి

రాజకీయాలలో రాణించడం అంత సులువేమీ కాదు. ప్రజలను నిత్యం అంటిపెట్టుకుని, వారి సమస్యలను పరిష్కరిస్తూ, ప్రజా సేవకు అంకితం అయినా, ప్రజాప్రతినిధులపై అసంతృప్తి ఉండడం అత్యంత సహజం. అందునా ఒక ప్రజాప్రతినిధి తాను ప్రాతినిధ్యం వహిస్తున్న సెగ్మెంట్ ను కాకుండా, ఇతర నియోజక వర్గం నుండి గెలుపొందడం చాలా అరు దైన విషయమే. అలా మూడు నియోజక వర్గాల నుండి విజయం సాధించి రాష్ట్ర శాసనసభకు వెళ్ళిన అరుదైన నేతగా గుర్తింపు పొందారు వరంగల్ జిల్లాకు చెందిన హయగ్రీవాచారి. అంతే కాదు. నలుగురు ముఖ్యమంత్రుల వద్ద మంత్రిగా పని చేసిన ఘనతను దక్కించుకున్న గొప్ప ప్రజా ప్రతినిధి ఆయన. వాస్తవంగా హయగ్రీవాచారి వరంగల్ జిల్లా ధర్మసాగర్ వాసి. ఆయన స్టేషన్ ఘన్‌పూర్ నియోజక వర్గం జనరల్‌గా ఉన్నప్పుడు అక్కడ ఒకసారి గెలిచారు. అలాగే ధర్మసాగర్ నుండి రెండు సార్లు, హన్మకొండ నుంచి ఒక సారి గెలిచారు. హయగ్రీవాచారి 1916 నవంబర్ 25 న ధర్మసాగర్ గ్రామంలో జన్మించారు. తిరునగరి శ్రీనివాసా చార్యులు అండాళమ్మ ఆయన తల్లిదండ్రులు. మూడవ తరగతి వరకు ధర్మసాగర్ లోని వీధి బడిలో చదివారు. కాంతంరాజు, రావుల నరసింహారెడ్డి వద్ద పెద్దబాలశిక్ష చదివారు. ఆ తరువాత వారి కుటుంబం హన్మకొండ పట్టణంలో స్థిరపడింది. ఆ రోజుల్లో హైదరా బాద్ సంస్థానంలో ప్రతి జిల్లా కేంద్రంలో ఒక ఉన్నత పాఠశాల ఉండేది. ఉన్నత పాఠశాలల్లో చదివే రోజుల్లోనే హయగ్రీవాచారిపై జాతీయోద్యమ ప్రభావం తీవ్రంగా పడింది. 1932లో నిర్వహించిన కాకతీయ ఉత్సవాలు ఆనాటి యువకులను ఉత్సాహ పరిచాయి. ఎంతో మందిలో ఉత్తేజాన్ని నింపాయి. ఆ ఉత్సవాల నిర్వహణలో పర్సా రంగారావు, ఉదయ రాజుశేషగిరిరావు, ఆవంచ వెంకట్రావు, మాదిరాజు రామ కోటేశ్వర రావు, కాళోజీ రామేశ్వర రావులతో పాటు విద్యార్థి సేవాదళ బాధ్యునిగా హయగ్రీవాచారి పని చేశారు. 1935లో హయగ్రీవారి మెట్రిక్ పరీక్షలో ఉత్తీర్ణులై ఇంటర్‌లో ప్రవేశించారు. హైదరాబాద్ చేరి చదువు మధ్యలోనే ఆపేశారు. ఆ తర్వాత ఆయన పూర్తి జీవితాన్ని ప్రజా సేవకే అంకితం చేశారు. వరంగల్లు అయ్యగారుగా ఆయన సుపరిచితులు. నిజాం వ్యతిరేక పోరాటం లో ప్రముఖ పాత్ర ఆయనది. స్వాతంత్రోద్యమంలో వరంగల్ నుంచి ఎదిగిన తొలితరం కాంగ్రెస్ నాయకుల్లో ఆయనొకరు. రాజకీయ సామాజిక రంగాల్లో ప్రత్యేకించి కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల్లో ఆయన తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న నాయకుడిగా గుర్తింపు పొందారు. నిజాం నిరంకుశ పరిపాలనకు వ్యతిరేకంగా స్వామి రామానందతీర్థ నాయకత్వంలో పోరాటం సాగించిన కొద్దిమంది నాయకులలో ఆయన ఒకరు. ఆయనే తిరునగరి హయ గ్రీవాచారి. హైదరాబాద్ హిందీ ప్రచార సభ అధ్యక్షుడిగా, హిందీ ప్రతిష్టాన్ వ్యవస్థాపకులుగా హిందీ భాషకు ఆయన చేసిన సేవ ఎంతో గొప్పది. వరంగల్ పట్టణంలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించ డానికి హయగ్రీవాచా రి ఎంతో శ్రమించారు. ఆయన కృషి ఫలితం గానే వరంగల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ వశమైంది. వయోజన ఓటింగ్ పద్ధతపై ఎన్నికైన వరంగల్ పురపాలక సంఘ తొలి అధ్యక్షుడిగా హయగ్రీవాచారి ఎన్నికయ్యారు. స్వాతంత్ర్యానంతరం ఆయన చేపట్టిన తొలిపదవిగా, వరంగల్ పురపాలక సంఘం తొలి అధ్యకుడిగా పని చేశారు. హయగ్రీవాచారి అవిభాజ్య వరంగల్ జిల్లా నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, నలుగురు సీఎంల మంత్రివర్గంలో సభ్యుడిగా పనిచేశారు. 1972 నుంచి ఆయన మంత్రిగా పనిచేశారు. పీవీ నర్సింహారావు, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి, టంగుటూరు అంజయ్య, భవనం వెంకట్రామిరెడ్డి మంత్రి వర్గాలలో ఆయన పనిచేశారు. ఆయన నిర్వహించిన పదవులను సమర్థవంతంగా చేశారనే పేరును సంపాదించు కున్నారు. పంచాయతీరాజ్, సాంకేతిక విద్య మొదలైన శాఖలను ఆయన నిర్వహించిన కాలంలో ఆయా శాఖలను సమర్థ వంతంగా నిర్వహించారని ఆయన పేరు తెచ్చుకున్నారు. 1962 శాసనసభ ఎన్నికలలో ధర్మసాగర్ నియోజకవర్గం నుండి, 1972 శాసనసభ ఎన్నికలలో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం నుండి, 1978 శాసనసభ ఎన్నికలలో హనమ కొండ నియోజకవర్గం నుండి శాసనసభ సభ్యుడిగా కాంగ్రెస్ పార్టీ తరపున ఎన్నిక య్యారు. మర్రి చెన్నారెడ్డి మంత్రివర్గంలో రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖామంత్రిగా పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యుడిగా వ్యవహరించారు. ఆంధ్ర ప్రదేశ్ స్వాతంత్ర్య సమరయోధుల సంఘానికి అధ్యక్షుడిగా కూడా ఇతడు కొంతకాలం ఉన్నారు.1950-52లో వరంగల్ జిల్లా పారిశ్రామిక సలహా మండలి సభ్యులుగా జిల్లాలో పరిశ్రమల స్థాపనకు కృషి చేశారు. సహకార ఉద్యమ వ్యాప్తి లోనూ, బలహీన వర్గాల పురోగతి లోనూ అయ్యగారి అసాధారణమైందని చెపుతుంటారు. హయగ్రీవా చారిని "అయ్యగారు" అని ముద్దుగా పిలుచు కునేవారు. ఆయన చేపట్టిన అనేక పదవుల ద్వారా అందివచ్చిన అవకాశాన్ని ఆయన సద్వినియోగం చేసుకున్నారు.వరంగల్ పురపాలక సంఘం ప్రథమ చైర్మన్‌గా, మంత్రిగా పని చేస్తూ విభిన్న వర్గాల అభివృద్ధిని ఆకాంక్షిస్తూ పలు నిర్ణయాలు తీసుకోవడంలో ఆయనను ప్రత్యేక పాత్ర పోషించారని ఆయన అభిమాన కాంగ్రెస్ నాయకులు హయగ్రీవాచారి చేసిన సేవల్ని ఎల్లపుడూ గుర్తుచేసు కుంటారు. వరంగల్ జిల్లాలో వివిధ స్థాయిలో వివిధ అంశాలపై మహాసభలు నిర్వహించడంలో ఆయన పాత్ర కృషి చెప్పుకోదగింది.వరంగల్ పట్టణానికి పోచంపాడు నీళ్లు తీసుకువచ్చి వరంగల్, హన్మకొండ, కాజీపేట పట్టణాలలో మంచినీటి కొరత తీర్చటంలో హయగ్రీవాచారి ఎంతో కృషి చేశారని ఆయనకు పేరుంది. వరంగల్ జిల్లా బోర్డు వైస్ చైర్మనగా హయగ్రీవాచారి జిల్లా సర్వతోముఖాభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తు చేసుకుంటారు. హయగ్రీవాచారి 1991, డిసెంబర్ 5వ తేదీన పీపుల్స్ వార్ గ్రూపు నక్సలైట్లచే హనుమకొండలోని స్వంత ఇంటిలో హత మార్చబడ్డారు.

# నాటక రంగంలో నిత్య పరిశోధకులు చాట్ల శ్రీరాములు

ఆరున్నర దశాబ్దాల పాటు రంగ స్థలమే జీవితంగా బతికిన వ్యక్తి. నాటక రంగంలో కొత్త ప్రక్రియలు ప్రవేశపెట్టిన నిత్య సాధకుడు, శోధకుడు, బోధకుడు, దర్శకుడు. థియేటర్ నటుడిగా ప్రాచుర్యం పొందాడు. 150 రేడియో నాటికల లోనూ నటించారు. థియేటర్ ఆర్ట్స్ రంగానికి అంకితమైన ప్రసిద్ధ సాహిత్య మరియు సాంస్కృతిక సంస్థ రసరంజని స్థాపనలో కీలక పాత్ర పోషించారు.దేశ, విదేశాలలో అనేక నాటకాలను ప్రదర్శిం చాడు. ఆంధ్రప్రదేశ్ నుండి మానవ వనరుల విభాగం నుండి ఎమెరిటస్ ఫెలోషిప్ అందుకున్న మొదటి కళాకారుడు. ఆయనే చాట్ల శ్రీరాములు. ఆంధ్ర విశ్వ విద్యాలయ రంగస్థల కళల శాఖలో దర్శకుడిగా బాధ్య తలు చేపట్టారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలోనూ బోధించారు. హైదరాబాదు విశ్వ విద్యాలయం, తెలుగు విశ్వ విద్యాలయాల్లో గౌరవ అధ్యాపకులుగా పనిచేశారు. మధు ఫిల్మ్ ఇన్స్టిట్యూట్ లో, అక్కినేని నట శిక్షణాలయంలో అతిథి అధ్యా పకులుగా బోధించారు నాగార్జున, వెంకటేశ్ లు ఆయన శిష్య బృందం లోని వారే కావడం విశేషం. చాట్ల శ్రీరాములు (డిసెంబరు 5, 1931 - డిసెంబర్ 18, 2015) తెలుగు నాటక రంగ నిపుణుడు, ప్రయోక్త, సినిమా నటుడు. శ్రీరాములు గడ్డి అచ్చయ్య, అచ్చమ్మ దంపతులకు 1931 డిసెంబరు 5 తేదీన బెజవాడలో జన్మించిన చాట్ల 12 సంవత్సరాల వయసులో విజయవాడలో దేశిరాజు రామారావు దర్శకత్వంలో ప్రదర్శించిన 'మేవాడు పతనం' అనే హిందీ నాటకంలో ఓ బాలుని పాత్ర ద్వారా రంగస్థల ప్రవేశం చేశారు. బి.కాం. చదువుతున్న రోజుల్లో నటుడు కావాలన్న కాంక్ష, నాటకం పట్ల ఉత్సాహాన్ని పెంచుకొన్నారు. చివరి సంవత్సరంలో ఉన్నప్పుడు విశాఖపట్నంలో ఆంధ్ర విశ్వ విద్యాలయం వారు నిర్వహించే అభ్యుదయ నాటక ఉత్సవాల్లో ఎస్.ఆర్.ఆర్. కళాశాల పక్షాన 'మాస్టర్జీ' నాటకాన్ని ప్రదర్శించగా, శ్రీరాములు ఉత్తమ నటుడిగా బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. 1956లో భారతీయ రైల్వే శాఖలో టిక్కెట్ కలెక్టర్‌గా ఉద్యోగ ప్రస్థానం మొదలైంది. పబ్లిక్ ఎడ్రసింగ్ సిస్టములో బొంబాయి ఆకాశవాణిలో శిక్షణ పొందారు. లండన్ లోని బ్రిటీష్ డ్రామా లీగ్ లో 1970లో నాటక ప్రయోక్తగా, ఆచార్యునిగా శిక్షణ పొందారు.చాట్ల 1976లో ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి వైస్ ఛాన్సలర్ ఎం.ఆర్. అప్పారావు కోరికపై స్టేజీ డైరెక్టర్ ఉద్యోగంలోకి ప్రవేశించారు. నాటక రంగంలో ఎన్నో ప్రయోగాలకు అదే నాంది అయింది. మధు ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌కు ప్రధానాచార్యుడుగా, వివిధ కళాసంస్థల్లో సభ్యుడు గా వ్యవహరించాడు.ఆయన నాటక రంగ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ నాటకం మరో మొహెంజోదారో. తెలుగు రాష్ట్రాలే కాదు దేశమం తటా సంచలనం సృష్టించిన నాటకం ఇది. రచయిత యన్.ఆర్.నంది. దీనికి చాట్ల దర్శకత్వంతో పాటు శాస్త్రవేత్త పాత్ర పోషించారు. ఇది కమలాదేవి ఛటోపాధ్యాయ పురస్కారానికి ఎంపికైంది. గొల్లపూడి మారుతీ రావు వ్రాసిన 'లావాలో ఎర్రగులాబీ' నాటకాన్ని చాట్ల దర్శకత్వం బంగారానికి తావి అబ్బడం లాంటిదని ఎందరో విమర్శకులు ప్రశంసించారు. చాట్ల ఆనాటి ప్రముఖ నటుడు కె. వెంకటేశ్వర రావుతో కలిసి 'కాళరాత్రి' అనే నాటకానికి దర్శకత్వం వహించారు. కొర్రపాటి గంగాధరరావు రచించిన 'విష కుంభాలు', 'డిటెక్టివ్', 'భవ బంధాలు', 'తెలుగు కోసం' మొదలైన నాటకాల్లో ప్రధాన పాత్రలు పోషించాడు. ఆంధ్ర నాటక కళాపరిషత్తు నుండి రెండు సార్లు ఉత్తమ నటుడి అవార్డు పొందారు.1954 ప్రాంతంలో రసమాఖ్య ప్రదర్శించిన 'దొంగవీరుడు', 'మాస్టర్జీ' మొదలైన నాటకాలకు పన్నెండు బహుమతులు అందుకున్నారు. గొల్లపూడి 'లావాలో ఎర్రగులాబీ', ఆత్రేయ 'మనసు వయసు', భమిడి పాటి రాధాకృష్ణ 'దైవశాసనం', 'సత్య కామేష్టి' నాటకాలు శ్రీరాములుకు బాగా పేరు తెచ్చాయి. న్యాయం కావాలి, స్వప్న, సుడి గుండాలు,సంగీత, విక్రం, అగ్నిపుత్రుడు, శశర, అగ్నిప్రవేశం తదితర చిత్రాలలో చాట్ల నటించారు. చాట్లలోని దర్శకుడు నిరంతర అన్వేషిగా, ప్రతీ నాటకం నాటికలో వైవిధ్యం ఉండాలని ఆశించారు. ఆయన ప్రతిభ ఇంటనే కాదు రచ్చలోనూ గెలిచింది. ఇంగ్లాండు, అమెరికా, పోలాండ్ తదితర దేశాల్లో పర్యటించి, అక్కడ వాళ్లకు శిక్షణ ఇచ్చారు.అనేక విశ్వ విద్యాలయాలు తమ రంగస్థల శాఖకు అధిపతిగా నియమించాయి. ఉమ్మడి రాష్ట్రంలోని తెలుగు విశ్వ విద్యాలయం, ఆంధ్రా విశ్వ విద్యాలయం, ఉస్మానియా విశ్వవిద్యాలయం వంటి కళాశాలలో సుమారు 26 సంవత్సరాల పాటు నాటకరంగ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహించారు.ఆధునిక తెలుగు నాటకరంగ చరిత్రలో కృత్తివెంటి నాగేశ్వరరావు, ధర్మవరం రామకృష్ణమాచార్యులు, బళ్ళారి రాఘవ, అబ్బూరి రామకృష్ణారావు, డాక్టర్ గరికపాటి రాజారావు, ఎ.ఆర్. కృష్ణ, కె.వెంకటేశ్వరరావు వంటి హేమాహేమీల జాబితాలో చాట్ల శ్రీరాములు పేరు కూడా కలిసిందంటే ఆయన నటనలో, దర్శకత్వంలో చేసిన అజరామరమైన కృషి, మేదస్సు రంగస్థలానికి నిలువెత్తు దర్పణం. దర్శకత్వంలో ఆయన చాలా ప్రయోగాలు చేశారు.1970 లో లండన్లోని బ్రిటిష్ డ్రామా లీగ్ చేత ఆయనకు 'నిర్మాత మరియు ఉపాధ్యాయుడు' సర్టిఫికేట్ లభించింది. శ్రీరాములుకు 1982 లో కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ అవార్డు, రెండుసార్లు ఉత్తమ నటుడిగా ఆంధ్ర నాటక కళా పరిషత్ అవార్డు లభించింది. 2003లో తంగిరాల కృష్ణప్రసాద్ స్మారక అవార్డు ఎన్టీఆర్ పుర స్కారం, నార్త్ అమెరికా తెలుగు సొసైటీ సత్కారం, రాష్ట్ర నాటక అకాడమీ నుంచి ఉత్తమ దర్శకుడి పురస్కారాలు ఆయనకు లభించిన గౌరవాల్లో కొన్ని మాత్రమే. 2009లో తెలుగు విశ్వ విద్యాలయం ఆయనకు గౌరవ డాక్టరేట్ ఇచ్చింది. శ్రీరాములు సికింద్రాబాద్ రైల్వే ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 2015, డిసెంబర్ 18 శుక్రవారం మృతి చెందారు.

# రిటైర్మెంట్ బకాయిలు.. పెన్షనర్ల హక్కు!

సంవత్సరాల పాటు ప్రభుత్వ వ్యవస్థను నిలబెట్టిన వారు.. ఉద్యోగులు, ఉపాధ్యాయులు.. ప్రజలకు సేవ చేయడంలో జీవితాన్ని అంకితం చేసి పదవీ విరమణ చేసిన తర్వాత, అదే ప్రభుత్వాల నిర్లక్ష్యానికి వారు బలవుతుండటం ఈ రాష్ట్ర పరిపాలనపై తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతోంది.చట్టబద్ధంగా రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ నెలల తరబడి అందక పెన్షనర్లు అనుభవిస్తున్న వేదన, కేవలం ఆర్థిక సమస్య కాదు ఇది ఒక మానవతా సంక్షోభం. ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు మరిచిపోయిన ఈ పరిస్థితిలో, వృద్ధుల హక్కుల కోసం జరుగుతున్న పోరాటం ప్రజాస్వామ్యంలో ఓ హెచ్చరికగా నిలుస్తోంది. ఉద్యోగి రిటైర్ అయిన రోజు ప్రభుత్వం అతడిని గౌరవంగా ఇంటికి సాగనంపాలి. ఆ సమయంలో ఇవ్వాల్సిన గ్రాట్యుటీ, కమ్యూ టేషన్, టీఎస్‌జీఎల్‌ఐ, జీపీఎఫ్, లీవ్ ఎన్‌కాష్ మెంట్ వంటి మొత్తాలు ఉద్యోగి ప్రభుత్వాల దయాదాక్షిణ్యాల మీద ఇచ్చేం కావు. తన జీవన కాలంలో నెలనెలా జీతం నుంచి మినహాయించుకున్న సొమ్మే.. అవి ఆలస్యం కావడం అంటే? వృద్ధాప్యంలో పెన్షనర్లను మనోవేదనకు గురి చేయడమే. 2024 మార్చి నుంచి పదవీ విరమణ చేసిన సుమారు 14 వేల మందికిపైగా పెన్షనర్లకు సంబంధించిన బకాయిలు నెలల తరబడి నిలిచిపోవడం కేవలం పరి పాలనా లోపం కాదు! మానవీయ వైఫల్యం.. పెన్షనర్ అనగానే ఈ దేశంలో ఇప్పటికీ 'భారం' అనే దృక్కోణం ఉంది. కానీ వాస్తవంగా చెప్పాలంటే ప్రభుత్వ వ్యవస్థను నిలబెట్టిన వేర్లు పెన్షనర్లే.. పాఠశాలల్లో విద్యా బోధన నుంచి రెవెన్యూ కార్యాలయాల వరకు, పోలీస్ స్టేషన్ల నుంచి జిల్లా పరిపాలన వరకు, వ్యవస్థలను నడిపించిన వారు పదవీ విరమణ అనంతరం మాత్రం పరాయి వారిగా మారుతారా? పనిచేసినంత కాలం చిన్న మొత్తంలో ప్రభుత్వ జీతంపై ఆధారపడి, రిటైర్ అయ్యాక రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ఎదురుచూస్తుంటారు. అది ఆలస్యం కావడం కారణంగా వృద్ధ పెన్షనర్లు అప్పుల ఒత్తిళ్లలో చిక్కుకుంటున్నారు.

ఈ మానసిక వేదన చివరకు ప్రాణాంతకంగా మారి ఇప్పటివరకు సుమారు 26 మంది పెన్షనర్లు మరణించారన్న విషయం సమాజాన్ని కలచివేసే అంశం. ఇన్ని జరుగుతున్నా ప్రభుత్వం మౌనంగా ఉండటం అమాన వీయం. 'ఆర్థిక లోటు' అన్న ఒకే ఒక వాదన పెన్షనర్ల హక్కులపై దాడి చేసే ఆయుధంగా మారింది. ఆశ్చర్యకరమేమంటే.. సేవ పేరుతో రాజకీయాలకు వచ్చి ఒక్కొక్కరు రెండు మూడు పెన్షన్లు తీసుకుంటున్న వారి వేతనాలు, అలవెన్సులు, అధికార విలాసాలకు ఈ ఆర్థిక లోటు అడ్డు రావడం లేదు. పెన్షనర్లు ప్రజాస్వామ్య పద్ధతిలోనే తమ గోడును వినిపించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మంత్రులు, ముఖ్యమంత్రి కార్యాలయానికి వినతి పత్రాలు అందిం చారు. 'సమస్య వాస్తవమే, పరిష్కరించాల్సిందే' అనే మాటలు వినిపించాయి. కానీ చర్యలు మాత్రం కనిపించలేదు. చివరకు హైదరాబాద్ ఇందిరాపార్క్‌లో నిర్వహించిన ధర్నాలో వేలాది వృద్ధ పెన్షనర్ల గుండెల్లోని బాధ రోడ్డు మీదకు వచ్చింది. 'మా బకాయిలను ఇవ్వండి.. మమ్మల్ని చంపవద్దు' అన్న ప్లకార్డులు ఈ రాష్ట్ర ప్రజాపాలనకు అద్దం పట్టాయి. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఇందుకు మీడియా కవరేజ్ సరిగ్గా లేదనే విమర్శ ఉంది. ప్రజాస్వామ్యంలో పోరాడలేని వృద్ధుల సమస్యలకు స్వరం ఇవ్వాల్సిన బాధ్యత మీడియాపై ఉంది. కానీ ఇది ఎక్కడో ఇది తప్పిపోయింది. ఇది వ్యవస్థల వైఫల్యం కాకపోతే మరేమిటి? సామాజికవేత్త బక్క జడ్సన్ లాంటి వారు నిస్వార్థంగా తమ వైకల్యాన్ని సైతం లెక్కచేయకుండా ప్రభుత్వానికి వినతులు సమర్పించినా స్పందన లేకపోవడం పాలకుల నిర్లక్ష్యాన్ని మరింత స్పష్టం చేస్తోంది.

పెన్షనర్లు అడుగుతున్నది దానం కాదు. వారి శ్రమకు లభించే న్యాయమైన హక్కు మాత్రమే. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఆలస్యం అనేది ఒక ఆర్థిక నిర్ణయం కాదు, ఒక మానవతా పరీక్ష. పాలకులే తాము చెప్పుకున్నట్టుగా తల్లిదండ్రుల పట్ల బాధ్యతను గుర్తిస్తే, జీవితాంతం ప్రభుత్వానికి సేవ చేసిన పెన్షనర్లు కూడా తల్లిదండ్రులాంటి వారేనని గుర్తించాలి. ఇకైనా ప్రభుత్వం చొరవ తీసుకొని పెండింగ్‌లో ఉన్న రిటైర్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి. మరింత ఆలస్యం జరిగితే జరిగే నష్టానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ప్రజాస్వామ్యంలో హక్కుల కోసం వృద్ధులు రోడ్ల మీద నిలబడాల్సి వస్తే, అది పాలన ఓటమి. ఆ ఓటమిని ఒప్పుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందా! లేదంటే? ఇప్పటికైనా మానవీయ నిర్ణయం తీసుకొని పెన్షనర్ల కన్నీళ్లకు ముగింపు పలకాలి.

# అంతులేని ఆవేదనలకు పరిష్కారం ఎక్కడ?

చాలీచాలని సంపాదనతో, ఆర్థికంగా సతమతమవుతూ, బతుకుదెరువు బహు కష్టంగా మారిన నేపథ్యంలో మధ్య తరగతి జీవితాలు అల్లకల్లోల సాగరాన్ని తలపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితులనుండి కాపాడి, ఒడ్డుకు చేర్చే శాశ్వత పరిష్కారాలను అన్వేషించడం అత్యవసరం. సమాజంలో పలు వైరుధ్యాలు తాండవిస్తున్నాయి. అహంకారమే తప్ప ఆలోచనా శక్తిలేని నూతన తరం రూపుదిద్దుకుంటున్నది. తరాల మధ్య అంతరం పెరిగింది. అంతరంగ మథనం లోపించింది. 'తాను మునిగిందే గంగ, తాను వలచిందే రంభ..' చందంగా మూర? భావజాలం, ఆధిక్యతా ధోరణి మానవ మస్తిష్కంలో తిష్ఠ వేసింది. స్వార్థం పరాకాష్ఠకు చేరింది. వంచనతో దర్జాగా బతికే వారు కొందరైతే, వ్యక్తిత్వంతో బతికలేక జీవశ్ఛవాల్లా జీవితాంతం మనోవేదనతో బతుకీడ్చేవారు మరికొందరు నేటి సమాజంలో అడుగడుగునా తారసపడతారు. తినడానికి తిండిలేక కొంతమంది విగతజీవులవుతుంటే, సకల సౌభాగ్యాలతో జీవిస్తూ, విలాసాల్లో తేలియాడుతూ ఏదో అసంతృప్తితో ఆత్మహత్యలకు పాల్పడేవారు మరికొందరు నేటి సమాజంలో మనకు అగుపిస్తున్నారు. యువశక్తి వ్యసనాలతో నిర్వీర్యమవుతున్నది. కలిమి కలత చెందుతున్నది. లేమి దిగులు చెందుతూ జీవనయానం సాగిస్తున్నది. ఒకవైపు మోదం, ఇంకోవైపు ఖేదం.. ఇదే సామాజిక వైపరీత్యం. అంబరాన్ని తాకే సంబరంతో ఆడంబరాలతో దిగంబరంగా మారుతున్న నూతన విన్యాసం ఒక వైపు... జానెడు పొట్ట నింపుకోలేక, కట్టుకోవడానికి సరైన గుడ్డలేక, ఉండడానికి సరైన గూడులేక అలమటించే అభాగ్యుల దీనగాథలు మరో వైపు మానవ జీవితం లోని అంతరాలను వెక్కిరిస్తున్నాయి. విందు వినోదాల ఉల్లాసాలు వికాసానికా? విలువల విధ్వంసానికా? ఇది ప్రగతికి బాటలు వేస్తున్నదా? బీటలు పెడుతున్నదా? ఒకవైపు మధ్య తరగతి జీవుల బతుకుల్లో హాలాహలం.. మరో వైపు బరువెక్కిన కరెన్సీని విలాసాలకు వెచ్చిస్తూ కాలయాపన చేస్తున్న యువతరం కోలాహలం. ఇది కలానికందని కల్లోలం. సగటు జీవుల బతుకుల్లోని వేదనలు కాలగర్భంలో దాగున్న కనబడని సుడిగుండాల వంటివి. కష్టాల సుడిగుండాలు బలపడి మృత్యు విహంగాలై జీవిత నావను తీరం దాటే తరుణంలో ప్రళయ ప్రభంజనమై ముంచేస్తున్నాయి. జీవన యానానికి ముగింపునిస్తున్న సన్నివేశాలు హృద్యం.. మరికొంతమందికి చోద్యం. కొందరి కంట కన్నీరు! కొందరి ఇంట సిరుల పన్నీరు! సేద్యంలో విలాపం.. స్వేదానికి దగ్గని ఫలితం. కొందరి స్వేదం మరికొందరికి కరెన్సీగా మారి, కొంత మంది ధనిక యువత చేతిలో ఖరీదైన మద్యం సీసాలా పరివర్తన చెంది వెక్కిరిస్తే ఇది సమాజ వికాసమా? విలాపమా? ఒక చెంత 'మందు'తో తనువు చాలిస్తున్న కర్షకుడు! మరోచెంత మందుతో గాండ్రిస్తున్న భోగలాలసుడు! విందు విలాసాలే జీవిత పరమార్థంగా కొందరు బతికేస్తున్నారు. ఆర్థికంగా చితికిపోయి అతి దీనంగా మరికొందరు బతుకీడ్చుతున్నారు. విలాసాల వినువీధుల్లో ఊరేగి, ఆశించింది అందక తనువు చాలిస్తున్నారు ఇంకొందరు! బతకాలని ఉన్నా బతకనీయని బడబాగ్ని జ్వాలలు చుట్టుముడుతుంటే, గరళాన్ని మింగుతున్న సగటు జీవుల వెతలు వర్ణనాతీతం. దేశానికి 'ముద్ద' పెడుతూ, ముద్ద లేక గతిస్తున్న కర్షకజన చరిత్ర ఆద్యంతం అత్యంత బాధాకరం. విలాసాల్లో మునిగి ప్రేమ అంచుల దాకా పయనించి పతనమవుతున్న యువతరానికి ఉరితాళ్ళే శరణ్య మవుతుంటే, కష్టాలను భరించలేని కర్షకునికీ ఆ ఉరితాళ్ళే ఆలంబన అవుతున్నాయి. మధ్య తరగతి జీవుల ఆర్థిక బాధలకు ఆత్మహత్యలే ఆఖరి అవకాశంగా మారుతున్నాయి. అందరి గమ్యం ఒకటై వెక్కిరిస్తుంటే చోద్యం చూడడం తప్ప ఏమీ చేయలేక నిస్సహాయంగా విలపిస్తున్నాం. ఒకరిది అర్థవంతమైన ఆవేదన, మరొకరిది అర్థంలేని మనోవేదన. ఇరువురూ విషాద గేయానికి పల్లవులే. నిద్దురలేని రాత్రులలో ప్రపంచం వెక్కిరిస్తుంటే పలకలేని గేయానికి చరణాలే. స్వరం తప్పిన గీతికలే. బతుకు వేదంలో శృతిలేని నాదాలే. ఇద్దరిదీ ఒకటే గమ్యం.. అదే మరణం. విలాసాల మోజుకు బానిసలై కడకు 'మనీ' లేక మినీ జీవితం గడపలేమని బలవుతున్న బడాయి జీవుల బతుకు చిత్రం ఒకరిదైతే, అహరహం స్వేదం చిందించి, దక్కని ఫలితంతో తనువు చాలిస్తున్న దైన్య చరిత మరొకరిది. ఇదే ఇరువురి జీవితాలలో కానరాని సారూప్యం.. అడుగడుగునా వైరుధ్యం. ఆశించినది దక్కక ఒకరు. హృదయం బరువెక్కి బతకలేక తనువు చాలిస్తున్నది మరొకరు.అర్థవంతమైన జీవితాలకు ముగింపు మరణమా? అర్థంలేని వ్యర్థవాదుల మనుగడకు మార్గమా ? విలాసాల విహంగంలా తేలియాడుతూ, కోరికల గుర్రాన్నెక్కి ఊహల్లో భ్రమిస్తూ పరిభ్రమిస్తున్న యువత తన లక్ష్యం మరచి, మత్తులో చిత్తవడం హాస్యాస్పదం. జల్సాలకు మరిగి, కోరింది దొరకలేదనే ఆవేశంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారు, ఒక్క క్షణం ఇతరుల జీవితాల్లో ఎదురవుతున్న సమస్యలను తొంగిచూస్తే వారి సమస్యల ముందు తమ సమస్యలు అర్థంలేని చిందరవందర గీతలుగా అగుపించక మానవు. అర్థవంతమైన జీవితాలకు ముగింపు మరణం కారాదు. జీవన తీరానికి దారులు ఆత్మహత్యలు కావనే సందేశం నిజం కావాలంటే ప్రస్తుత పరిస్థితులు మారాలి.

# చెట్టుకొమ్మ విరిగి పడి వ్యక్తి దుర్మరణం

జహీరాబాద్, : జహీరాబాద్ మండలం శేకాపూర్ గ్రామంలో చెట్టు నరికే పనికి వెళ్లిన అశోక్ (45) అనే వ్యక్తి, చెట్టు కొమ్మ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం ఉదయం జరిగిన ఈ సంఘటనలో, చెట్టు కోస్తుండగా కిందపడిన కొమ్మ అశోక్ తలకు బలంగా తగిలి తీవ్ర రక్తస్రావంతో మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## మల్దకల్ జాతరకు బస్సులు లేక భక్తుల అవస్థలు.!

గద్వాల, : జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ లోని శ్రీస్వయంభు లక్ష్మీవెంకటేశ్వర స్వామి జాతర సందర్భంగా భక్తులు తీవ్ర రవాణా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జాతరకు వచ్చే భక్తుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపకపోవడంతో వేలాది మంది ప్రజలు అవస్థలు పడుతున్నారు. బస్సుల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుండటంతో వృద్ధులు, మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వెంటనే అదనపు బస్సులను ఏర్పాటు చేయాలని ప్రజలు ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు.

## చింతపల్లి సాయిబాబా దేవాలయాన్ని
# దర్శించుకున్న మంత్రి

దేవరకొండ, : గురువారం, రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చింతపల్లి మండల కేంద్రంలోని ప్రముఖ సాయి బాబా దేవాలయాన్ని సందర్శించారు. దత్త జయంతి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు మంత్రికి ఘనంగా స్వాగతం పలికి, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.

## టోల్గేట్ వద్ద పోలీసులకు అడ్డంగా బుక్కయ్యారు



మిర్యాలగూడ, : మిర్యాలగూడ రూరల్ పోలీసులు చెల్లేపల్లి టోల్గేట్ వద్ద గురువారం ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా ధాన్యం తరలిస్తున్న 11 లారీలను పట్టుకున్నారు. తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసి, అనుమతులు లేకుండా తెలంగాణలోని మిర్యాలగూడ రైస్ మిల్లులకు తరలిస్తున్న దళారులను పోలీసులు గుర్తించారు. డ్రైవర్లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అనుమతులు లేకుండా ధాన్యం తరలిస్తే అక్రమ రవాణాగా పరిగణించి, పూర్తిస్థాయి విచారణ అనంతరం కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

## బోర్లం క్యాంపు నాల్గవ వార్డు సభ్యునిగా
## కుడుగొల్ల హరికృష్ణ నామినేషన్



బాన్సువాడ, : కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం బోర్లం క్యాంపు గ్రామంలో నాల్గవ వార్డు నుంచి యువకుడు కుడుగొల్ల హరికృష్ణ గురువారం వార్డు సభ్యునిగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల నమ్మకం, ఆశీర్వాదాలతో వార్డు సమస్యలను పరిష్కరించి అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. సేవాభావంతో పనిచేస్తూ ప్రతి ఇంటి సమస్యను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హరికృష్ణ హామీ ఇచ్చారు.

## కేటీఆర్ పర్యటనలో విషాదం..
## కెమెరామెన్ గుండెపోటుతో మృతి

కుత్బుల్లాపూర్, : హైదరాబాద్‌లోని కుత్బుల్లాపూర్ జీడిమెట్ల ప్రాంతంలో మంత్రి కేటీఆర్ పర్యటనను చిత్రీకరిస్తున్న సమయంలో ఒక విషాదకర సంఘటన చోటుచేసుకుంది. ఒక టీవీ ఛానెల్‌లో పనిచేస్తున్న కెమెరామెన్ దామోదర, గుండెపోటుతో కుప్పకూలిపోయారు. వెంటనే అతడిని సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే, చికిత్స పొందుతూ దామోదర మృతి చెందారు. ఈ ఘటన మంత్రి పర్యటనలో కలకలం సృష్టించింది.

## కొణిజేటి రోశయ్య విగ్రహానికి నివాళులు



షాద్‌నగర్, : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా షాద్‌నగర్ పట్టణంలో ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, పట్టణ అధ్యక్షుడు కోంకళ్ళ చెన్నయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మల్లిపెద్ది శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు పెద్ది రాం మోహన్, మాజీ అధ్యక్షుడు సరాపు రమేష్ పాల్గొన్నారు.

# “15,16ఛలో ఢిల్లీ”, పార్లమెంటు ముట్టడి:జాజుల

కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో సర్పంచ్ ల ఎన్నికల్లో బిసిల ఐక్యత చాటాలని నిన్న గురువారం ఉదయం బహిర్భాగ్ ప్రెస్ క్లబ్ లో జాజుల శ్రీనివాస్ గౌడ్ విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు.అలాగే ఆయన మాట్లాడుతూ జనరల్ స్థానాలలో బరిలో ఉన్న బీసీ అభ్యర్థులను పార్టీల కతీతంగా గెలిపించండి అంటూ ప్రజలకు కోరారు.అలాగే మోసం చేస్తున్న పార్టీలకు బుద్ధి చెప్పాలంటే బీసీలు సర్పంచ్ సీట్లను అత్యధికంగా కైవస%శీ% చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.పార్టీ పరంగా ఇస్తామన్న పార్టీలు ఇప్పుడు ఎవరు నోరు మెదపడం లేదు ? కాంగ్రెస్, బిజెపిలకు మాట మార్చడంలో,మోసం చేయడంలో ఎన్ని అవార్డులు ఇచ్చిన సరిపోవున్నారు.గల్లీ నుండి ఢిల్లీ దాకా బీసీలను మోసగిస్తున్న కాంగ్రెస్ పార్టీ.ఈనెల 15న ఢిల్లీలో పార్లమెంట్ ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ లో జాజుల శ్రీనివాస్ గౌడ్ ఈ విషయాన్ని వెల్లడించారు.బీసీలను మోసం చేసిన రాజకీయ పార్టీలకు బుద్ధి చెప్పాలంటే ప్రస్తుతం జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికలలో జనరల్ స్థానాల్లో పోటీ చేస్తున్న బీసీ అభ్యర్థులను పార్టీలకతీతంగా గెలిపించి బీసీల రాజకీయ చైతన్యన్నీ చాటి చెప్పాలని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ రాష్ట్రంలోని బీసీలకు పిలుపునిచ్చారు.హైదరాబాదు లోని బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 15, 16 వ తేదీలలో చేపట్టబోయే పార్లమెంట్ ముట్టడి వాల్ పోస్టర్ ను బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ,కో చైర్మన్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్,బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి,బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్,బీసీ “ఏ” కులాల అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం. బాగయ్య,సంచార జాతుల సంఘం అధ్యక్షులు కే. వీరస్వామిలతో కలిసి జాజుల శ్రీనివాస్ గౌడ్ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ

చట్టబద్ధంగా 42% రిజర్వేషన్లు ఇవ్వలేమని, పార్టీపరంగా 60 శాతం ఇస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ పార్టీ మొన్న గాంధీభవంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో గానీ, మక్తల్,కొత్తగూడెం, హుస్నాబాద్ లలో జరిగిన బహిరంగ సభలో గానీ సీఎం రేవంత్ రెడ్డి,టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ లు ఆ మాటే మాట్లాడడం లేదని,బీసీలను మోసగించడానికి 60 శాతం అంటూ డ్రామాలాడారని ఆయన మండిపడ్డారు.ఇక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిన్న ఢిల్లీ పర్యటనలో ప్రధాని నరేంద్ర మోధీని కలిసిన సందర్భంలో 42% బీసీ రిజర్వేషన్ల గురించి ప్రధానితో చర్చించకపోవడం బీసీలను నయవంచనకు గురిచేయడం కాదా అని ఆయన ప్రశ్నించారు.

కనీసం తమ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీనీ కలిసిన సందర్భంలో బీసీ రిజర్వేషన్ల బిల్లుపై పార్లమెంటు స్తంభింపజేసి కేంద్రం పై ఒత్తిడి పెంచాలని, నడుస్తున్నందున పార్లమెంట్లో కార్యాచరణ పై ఎందుకు చర్చించలేదు బీసీ సమాజానికి సీఎం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.అడగాల్సిన కాంగ్రెస్ అడగడం లేదని,చేయాల్సిన బిజెపి బీసీ రిజర్వేషన్ల బిల్లును తొక్కిపెడుతుందని,బీసీలను నమ్మించి మోసం చేయడంలో బిజెపి కాంగ్రెస్ దొందు దొందేనని,వారి అబద్ధాలకు



ఎన్ని అవార్డులు ఇచ్చిన సరిపోవని ఆయన ఎద్దేవ చేశారు.42% బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తే రాష్ట్రవ్యాప్తంగా బీసీలకు 5380 సర్పంచ్ స్థానాలు దక్కేవని,బీసీ రిజర్వేషన్లను 17 శాతం కు తగ్గించి మోసం చేశారని, రాజకీయ పార్టీలు బీసీలకు చేసిన మోసానికి బుద్ధి చెప్పాలంటే రాష్ట్రంలోని జనరల్ స్థానాలలో నిలబడిన బీసీ అభ్యర్థులను పార్టీల కతీతంగా గెలిపించి సర్పంచ్ ఎన్నికలలో బీసీల సత్తాను చాటి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.బీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్ లో ఆమోదించాలని ఈనెల 15వ తేదీన ఢిల్లీలో పార్లమెంటును ముట్టడించడానికి తెలంగాణ నుండి పార్టీల కతీతంగా వేలాదిమంది ఢిల్లీకి తరలి రావాలని,16వ తేదీన ఢిల్లీలో జరిగే అఖిలపక్ష సమావేశాన్ని విజయవంతం చేయాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు.

# ప్రభుత్వ నిబంధనలు వ్యతిరేకిస్తే చర్యలు తప్పవు

- వెస్లీ స్కూల్ రహదారి కేసులో పంచనామా
- అధికారులు, స్థానికులు హెచ్చరించిన లెక్కచేయని బిల్డర్
- స్థానికులు కోర్టును ఆశ్రయించడంతో దిక్కుతోచని పరిస్థితి
- రాజకీయ నాయకులు అండదండతో రెచ్చిపోయి నిర్మాణదారుడు
- ప్రభుత్వ స్థలం ఉందని తెలిసి కూడా అక్రమానికి తెగబడ్డ బిల్డర్
- కబ్జాదారుల సహకారంతో ప్రభుత్వాన్ని బోల్తా కొట్టడానికి పూనుకున్న వైనం



నాచారం(ప్రశ్న న్యూస్) ధన బలం రాజకీయ బలం ఉంది ఇక నాకు అడ్డుంది అన్నట్లుగా ఇటీవల కొంతమంది బిల్డర్లు జిహెచ్ఎంసి పరిధిలో రెచ్చిపోయి అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు కొంతమంది అడుగు ముందుకేసి ప్రభుత్వ స్థలాలనే కబ్జా చేసి నిర్మాణాలు చేస్తున్నారు. స్థానిక కార్పొరేటర్లు ఎమ్మెల్యేల సహకారంతో ఈ అక్రమాలు జరుగుతున్నాయని స్థానికులు బహిరంగంగా ఆరోపిస్తున్న పట్టించుకునే నాధుడే లేకుండా పోయాడు. చివరికి కోర్టు మెట్లు ఎక్కితే తప్ప బాధితులకు ప్రభుత్వానికి న్యాయం జరగడం లేదు అవినీతి అక్రమాల వెనుక అధికారులే ఉంటూ అన్ని తామై చూసుకుంటున్నారు అందులో ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ విభాగ అధికారుల అవినీతిపందా జోరుగా సాగుతోంది. నాచారం అన్నపూర్ణ కాలనీలోని వెస్లీ స్కూల్ ప్రధాన రహదారిపై కొనసాగుతున్న అక్రమ నిర్మాణం పై స్థానికులు కోర్టుని ఆశ్రయించిన విషయం తెలిసిందే. రహదారిని, ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తున్నారని ఆరోపిస్తూ వెస్లీ స్కూల్ పూర్వ విద్యార్థులు ఇటీవల హైకోర్టును ఆశ్రయించి స్టే తీసుకురావడంతో కబ్జాదారులకు తగిన గుణపాఠం జరిగిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. స్థానికుల పిటిషన్‌పై స్పందించిన కోర్టు, మున్సిపల్ అధికారులను నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.ఆ నివేదికలో ప్రాంతం బఫర్ జోన్‌తో పాటు ప్రభుత్వ భూభాగం కూడా ఉందని అధికారులు కోర్టుకు నివేదిక సమర్పించారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు ఈ నెల 20న ఉత్తర్వులు జారీ చేస్తూ భవిష్యత్తులో ఎలాంటి నిర్మాణాలు చేయకూడదని స్పష్టం చేసింది. ఒకవేళ నిర్మాణం కొనసాగితే తక్షణం సీజ్ చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించింది. అలాగే విద్యుత్, తాగునీరు వంటి అనుమతులు ఇవ్వరాదని కూడా కోర్టు సూచించింది. ఈ ఆదేశాల మేరకు కాప్రా టౌన్ ప్లానింగ్ అధికారి తుల్జా సింగ్, సిబ్బంది స్థలాన్ని పరిశీలించారు. అనంతరం హైకోర్టు ఆదేశాల ప్రకారం పంచనామా నిర్వహించి నిర్మాణానికి సంబంధించిన వివరాలను నమోదు చేసి బిల్డర్ కు తెలిపారు ఉన్నత అధికారులకు అందించారు. కోర్టు తీర్పు విలువైన వచ్చినప్పటినుండి కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ డిసిపి కృష్ణమోహన్ అత్యంత ఆలస్యంగా స్పందించారని కబ్జాదారులకు పూర్తిగా సహకరిస్తున్నారని గతంలో కూడా ఈ అక్రమ నిర్మాణానికి పూర్తి సహకారం అందించారని, అదేవిధంగా కాప్రా సర్కిల్ పరిధిలో అనేక అక్రమ నిర్మాణాలకు డిసిపి కృష్ణమోహన్ అండగా ఉంటున్నారని చర్యలు తీసుకోకుండా మున్సిపల్ ఆదాయానికి భారీగా గండికోడుతున్నారని స్థానికులు ఆరోపించారు.

## మల్లవరం సర్పంచి అభ్యర్థి
# కిరణ్ నామినేషన్ దాఖలు

సత్తుపల్లి, : తల్లాడ మండలం మల్లవరం గ్రామపంచాయతీ సర్పంచి అభ్యర్థిగా కటికి కిరణ్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. వార్డు సభ్యులతో కలిసి భారీ ర్యాలీగా నామినేషన్ కేంద్రానికి చేరుకున్న ఆయన, కాంగ్రెస్ పథకాలు, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి తనను గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెనుబల్లిలో కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి నామినేషన్

ఖమ్మం, : పెనుబల్లి మండలం, మండలపాడు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి గాయం రమేష్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, విజయ్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పెనుబల్లి మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు..

## పలువురు బీజేపీ నాయకుల అరెస్టు

వరంగల్ ఈస్ట్, : వరంగల్ లో శివనగర్ వాటర్ ట్యాంక్ వద్ద అండర్ డ్రైనేజీ పనుల జాప్యాన్ని నిరసిస్తూ గురువారం బీజేపీ చేపట్టిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. అధికారుల నిర్లక్ష్యంపై నినాదాలు చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్‌తో సహా పలువురు నాయకులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు. ఐదేళ్లుగా పనులు నత్తనడకన సాగుతున్నాయని, ప్రభుత్వం, స్థానిక మంత్రి కొండా సురేఖ పట్టించుకోవడం లేదని గంట రవికుమార్ విమర్శించారు. పనులు వెంటనే పూర్తి చేయాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు..

## అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ
# పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

నర్సంపేట, : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులకు 1, 3, 5 సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లించడానికి చివరి తేదీని డిసెంబర్ 27, 2025 వరకు పొడిగించారు. నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మల్లం నవీన్, కోఆర్డినేటర్ డాక్టర్ వి. పూర్ణచందర్ ఈ విషయాన్ని గురువారం తెలిపారు. ఐదవ సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి 7-12, 2026 వరకు, మూడో సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి 13-20, 2026 వరకు, మొదటి సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి 22-28, 2026 వరకు నిర్వహించబడతాయి.

## నర్సాపూర్ నియోజకవర్గం
## అభ్యర్థులకు కలెక్టర్ కీలక సూచనలు

నర్సాపూర్, : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రలోభాలు లేదా బెదిరింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాహుల్ రాజ్ హెచ్చరించారు. కౌడిపల్లి ఎంపీపీ కార్యాలయంలో జరుగుతున్న నామినేషన్ ప్రక్రియను పరిశీలించిన ఆయన, ఎన్నికల ఖర్చులను విధించిన నిబంధనల ప్రకారం మాత్రమే చేయాలని అభ్యర్థులకు సూచించారు. రూ. 50 వేల కంటే ఎక్కువ నగదు ఉంచుకోవద్దని, అవసరమైతే సరైన ఆధారాలు కలిగి ఉండాలని తెలిపారు.

## అందరి మద్దతుతో ఉద్యమం ముందుకు
### - జేఏసీ సెంట్రల్ కమిటీ కన్వీనర్ బీ. దశరధరామిరెడ్డి



గూడూరు (ప్రశ్న న్యూస్) గూడూరు నియోజకవర్గంలోని ప్రజలందరి మద్దతుతో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళుతామని గూడూరు జిల్లా సాధన సమితి జేఏసీ సెంట్రల్ కమిటీ కన్వీనర్ బీ. దశరధ రామిరెడ్డి అన్నారు. గూడూరు పట్టణంలోని రోటరీ భవన్లో జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమాన్ని క్షేత్ర స్థాయిలో తీసుకెళ్లేందుకు అందరి మద్దతు తీసుకుంటామన్నారు. అలాగే నియోజకవర్గంలోని వివిధ పార్టీలు, కార్మిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, క్లబ్స్, క్రీడా సంస్థలు గూడూరును నెల్లూరులో కలపాలి లేనిపక్షంలో జిల్లా చేయాలని జిల్లా కలెక్టర్ కు వినతిపత్రాలు సమర్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం జేఏసీ సెంట్రల్ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. జేఏసీ కార్యదర్శిగా చిరువెళ్ల సునీల్ కుమార్, ట్రెజరర్ లుగా నిరంజన్ రెడ్డి, శంకర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరి గా షేక్ జమాలుల్లా, జాయింట్ సెక్రెటరీగా టీ. నాగేశ్వరావు, సాంస్కృతి, సాహిత్య విభాగం కన్వీనర్ గా వేగూరు విజయ్ కుమార్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కో కన్వీనర్ సీహెచ్. ప్రభాకర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఏకగ్రీవాల పేరుతో
## బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు

మెదక్, : తూప్రాన్ డీఎస్పీ నరేందర్ వెల్దుర్తిలో మీడియాతో మాట్లాడుతూ ఎవరినైనా ప్రలోభాలకు గురిచేయడం లేదా బెదిరించడం ద్వారా ఏకగ్రీవాలు సాధించడానికి ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. బహిరంగ వేలంపాటల ద్వారా పదవుల అమ్మకాలు జరిపే ప్రయత్నాలు గమనిస్తే తక్షణమే కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని గురువారం హెచ్చరించారు. ప్రజాస్వామ్యబద్ధంగా, స్వేచ్ఛగా ఎన్నికలు జరిగేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.

## సర్పంచ్ పదవికి యంబిబిఎస్
# విద్యార్థిని నిఖిత పోటీ

వనపర్తి, : వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం ఏటిగడ్డ శాఖాపూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానానికి వైద్య విద్యార్థిని కేఎన్. నిఖిత రెండో విడతలో నామినేషన్ దాఖలు చేశారు. గ్రామాన్ని అభివృద్ధి చేయడం కోసం తాను నామినేషన్ వేసినట్లు, గ్రామ ప్రజలు తనకు ఓటు వేసి గెలిపించాలని ఆమె కోరారు. ఆమె నామినేషన్ వేయడంతో గ్రామంలోని యువత అభినందిస్తున్నారు.

## కొనుగోలు కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అదనపు కలెక్టర్ నగేష్



వేములవాడ అర్బన్ / బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ అర్బన్ మండలం,అనుపురం గ్రామం, బోయినిపల్లి మండలం మాన్వాడలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ఏ-గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ. 2389, సాధారణ రకానికి రూ. 2369 మద్దతు ధరను నిర్ణయించిందని తెలిపారు. రైతులు తమకు సమీపంలోని కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి, ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.నిర్ధారించిన తేమ శాతం ఉన్న ధాన్యాన్ని తప్పనిసరిగా కొనుగోలు చేసి, అక్కడి నుంచి కేటాయించిన రైస్ మిల్లులకు సకాలంలో తరలించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రైతులకు పూర్తిగా సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోయినిపల్లి తహసీల్దార్ నారాయణ రెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లా లాంగ్ టెన్నిస్ సెలక్షన్ కం టోర్నమెంట్ పోటీలు.



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని జూనియర్ కళాశాల మైదానంలో 4బి 12బి 2025 గురువారం రోజున స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పెద్దపల్లి, సిరిసిల్ల ,జగిత్యాల స్థాయి లాంను టెన్నిస్ పోటీలు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో పిడి కొమరోలు శ్రీనివాస్ ఎస్ జి ఎఫ్ మంథని జోనల్ సెక్రెటరీ వేల్పుల సురేందర్ పెద్దపల్లి పిటి అధ్యక్షులుతో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జే సురేష్ లాంగ్ టెన్నిస్ అసోసియేషన్ పెద్దపెల్లి ఉపాధ్యక్షులు సుంకర జగదీశ్వర్ బొజ్జ విజయ్ కుమార్ లతోపాటు సీనియర్ క్రీడాకారులు అట్టెం రాజు పోతన వేణి వినోద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు ఎంపికైన క్రీడాకారులు హైదరాబాదులో జరిగే ఎస్ జి ఎఫ్ లాంగ్ టెన్నిస్లో పాల్గొంటారని కనుకుంట్ల లక్ష్మణ్ జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి తెలియజేశారు.

## ధర్పల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి




ధర్పల్లి (ప్రశ్న న్యూస్) నిజామాబాదు జిల్లా ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి ధర్పల్లి మండల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశమై రాబోయే స్థానిక సంస్థల 1ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణ,ప్రత్యేక నిఘా చర్యలపై స్పష్టమైన సూచనలు ఇచ్చారు. అలాగే, సెన్సిటివ్, క్రిటికల్ పోలింగ్ స్టేషన్ల గుర్తింపు, బౌండోవర్ వ్యక్తుల పర్యవేక్షణ, బీట్స్, నైట్ పెట్రోలింగ్ క్రమబద్ధీకరణ వంటి అంశాలపై పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. ఇంకా, ధర్పల్లి మండల పరిధిలోని సమస్యాత్మక గ్రామ పంచాయితీలను అడిగి తెలుసుకొని, కొన్ని పోలింగ్ కేంద్రాలను ప్రత్యక్షంగా పరిశీలించారు.గ్రామ పెద్దలు, స్థానిక ప్రతినిధులతో కూడిన చర్చల ద్వారా గ్రామాలలో శాంతియుత వాతావరణం నెలకొల్పే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## బాల్య వివాహాలపై అవగాహన ఉండాలి

**- ఐసిడిఎస్ సూపర్వైజర్ శివ జ్యోతి**



గూడూరు (ప్రశ్న న్యూస్) గూడూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ చెన్నూరు సెక్టార్ పరిధిలోని కామాక్షి నగర్ అంగన్వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో సూపర్వైజర్ శివ జ్యోతి మాట్లాడుతూ 18 సంవత్సరములు నిండకముందు వివాహము చేయరాదని తెలియజేసినారు. కిషోర్ బాలికలకు విద్యా హక్కు, నైపుణ్యం, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. కిషోరి బాలికల దగ్గర ప్రతిజ్ఞ చేయించారు. ఈ అంగన్‌వాడీ వర్కర్లు, కిషోర్ బాలికలు, పాల్గొన్నారు.

# పోరాటపటిమ, పరాక్రమవంతుల నిలయం గూడూరు నియోజకవర్గం

**- గూడూరు జేఏసీకి సంపూర్ణ మద్దతు**
**- నెల్లూరు లో కలిపేంత వరకూ పోరాటం**
**- ప్రజా చైతన్యంతోనే ఉద్యమం ఉధృతం**
**- బీజేపీ సీనియర్ నాయకులు పేర్నాటి రంగారెడ్డి**





గూడూరు (ప్రశ్న న్యూస్) పోరాటపటిమ, పరాక్రమంతులకు నిలయం గూడూరు నియోజకవర్గం అని బీజేపీ సీనియర్ నాయకులు పేర్నాటి రంగా రెడ్డి అన్నారు. గురువారం ఆయన గూడూరుకు విచ్చేశారు. రోటరీ భవన్లో గూడూరు జిల్లా సాధన సమితి జేఏసీ నాయకులను కలిశారు. జేఏసీకి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ప్రత్యేక జిల్లా, గూడూరును నెల్లూరులో విలీనం చేయాలనే డిమాండ్ తో జేఏసీ నాయకులు చేస్తున్న శాంతియుత పోరాటానికి మద్దతు తెలిపారు. నియోజకవర్గంలో ఉద్యమ బలోపేతం కోసం సహకారం అందిస్తామని తెలిపారు. గూడూరు నియోజకవర్గం పరాన్న భుక్తుల చేతిలోకి వెళ్తుందని మనం బాధపడుతున్నామన్నారు. స్వార్థపరులు, దోపిడీదారులు, వ్యాపారస్తుల మనస్తత్వానికి, వారి ఆలోచనలకు లోబడి పాలకులు పయనిస్తే మన పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. భావితరాలకు మనం సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఎదురవుతుందన్నారు. మన మనోగతాన్ని శాంతియుతంగా, చట్టబద్ధంగా చెప్పుకుంటూ ప్రజల మనోభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ధనపదులు, ఘనపదులు చేసే కుట్రలు, కుతంత్రాలను జనపదులకు విడమరిచి చెపుతూ మన ఉద్యమాన్ని ముందుకు తీసుకెళితేనే ఈ ఉద్యమం విజయవంతం అవుతుందన్నారు. సంయమనం, ఓర్పు, నిజాయితీతో ముందుకు సాగితే ప్రజలు మన వెంట నడుస్తారన్నారు. కూటమి పేరుతో ప్రజలకు కష్టాలు పెట్టి దుష్ట కూటమి అనిపించుకోవద్దని పాలకులకు హితవు పలికారు. కాలకూట విషాన్ని ప్రజలకు తాగించి హృదయాలను వ్రణ కూటమి చేయకండన్నారు. వ్యాపారుల సలహాలు తీసుకోకుండా నియోజకవర్గం ప్రజల అభీష్టానికి అనుగుణంగా గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర నాయకులు మిడతల రమేష్ మాట్లాడుతూ గూడూరు తిరుపతి జిల్లాలో కలపడం వలన కలిగే నష్టాలు, నెల్లూరు జిల్లాలో విలీనం చేయడం వలన కలిగే లాభాలను క్షుణ్ణంగా వివరించారు. ఈ సమావేశంలో జేఏసీ సెంట్రల్ కమిటీ కన్వీనర్ దశరథ రామిరెడ్డి, కో కన్వీనర్ ప్రభాకర్, కన్వీనర్లు శంకర్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, విజయ్ కుమార్, చిరంజీవి, రవి, జమాలుల్లా, సీవీఆర్. కుమార్, శశి కుమార్, నాసిన భాస్కర్ గౌడ్, నాగేశ్వర రావు, కె. నారాయణ, సీనియర్ పాత్రికేయులు సుధాకర్ రావు, ఉద్దాల మణి, పల్లిపాటి మస్తాన్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సుధీర్, మురళీ సింగ్, ఎం. జయపాల్ రెడ్డి, సుబ్రమణ్యం రాజు, ప్రభాకర్ రెడ్డి, నయీమ్, సుబ్బారావు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# నీతిమాలిన పనులు దుద్దిళ్లకే అలవాటు...

**- సపాయి కార్మికుడికున్న విలువ పోలీసులకు లేకుండా పోతాంది**
**- ప్రజల పక్షాన పోరాటం చేస్తే అక్రమ కేసులు పెడ్తరా**
**- కోర్టులు మందలించినా పోలీసుల్లో మార్పు రావట్లే**
**- దుద్దిళ్ల కుటుంబాన్ని అర్థం చేసుకుంటే బాగుపడుతరు**
**- కాటారం మండల ప్రజల బిక్షతోనే మంత్రి పదవని గ్రహించాలే**
**- ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గేదు లేదు**
**- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**



మంతని ( ప్రశ్న న్యూస్) ప్రజల పక్షాన పోరాటం చేసే వాళ్లపై అక్రమ కేసులు పెట్టించే నీతిమాలిన పనులు దుద్దిళ్ల శ్రీధర్‌కు అలవాటేనని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. ఇటీవల అక్రమకేసులో జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చిన కాటారం మండలం గంగారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు చల్లా శేఖర్‌రెడ్డిని ఆయన పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గంగారం గ్రామంలో చల్లా శేఖర్‌రెడ్డి ప్రజల పక్షాన గ్రామపంచాయతీలో ప్రజల డబ్బుల వసూళ్ల అన్యాక్రాంతం అయ్యాయని పోరాటం చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం దుద్దిళ్ల శ్రీధర్ నేతృత్వంలో అక్రమ కేసు పెట్టారని అన్నారు. కేసులు నిజమైనవి అయితే కనీసం 15రోజులు జైల్లో ఉండాలే కానీ మూడు రోజుల్లోనే బెయిల్ రావడంతో అక్రమకేసులు అని అర్థం అవుతుందన్నారు. ఎన్నిసార్లు దుద్దిళ్ల నైజాన్ని చెప్పినా పోలీసుల్లో మార్పు రావడం లేదని, మంత్రి పదవి ఎప్పుడు వస్తే అప్పుడు ఖాకీ దుస్తుల విలువ తీసేసుకుంటాండ్లని ఆయన అన్నారు. అందుకే సపాయి కార్మికుడికి ఉన్న విలువ ఖాకీలకు లేదని ఇప్పటికే చెప్పామని అన్నారు. అయినా మార్పు రావడం లేదని వాపోయారు. అధికారంలో ఉంటే ఒక రకంగా అధికారంలో లేకపోతే ఒకరకంగా ఊసరవెల్లిలా ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ వ్యవహరిస్తారని అన్నారు. ఆనాడు మందుబస్తాల కోసం ధర్నా చేసి ప్రజల పక్షాన నిలబడితే తనపై రౌడీషీట్ పెట్టారని ఆయన గుర్తు చేశారు, అలాగే జోడు శ్రీను, శేఖర్‌రెడ్డి, పూదరి సత్యనారాయణగౌడ్‌లపై అక్రమ కేసులు పెట్టారని, కోర్టుకు పోతే ఏ కేసులో పస లేదని వెంటనే బెయిల్ మంజూరీ చేశారన్నారు.అంతేకాకుండా భూపాలపల్లి న్యాయమూర్తి ఇది ఫేక్ కేసు అని అర్డర్ ఇచ్చారని, ఉన్నత చదువులు చదివి ఎల్ఎల్‌బీ చేసిన దుద్దిళ్ల శ్రీధర్ తల ఎక్కడ పెట్టుకుంటాడని ప్రశ్నించారు. దేవెందర్ రెడ్డి ప్రజల సోమ్ము వాడుకుంటాండ్లని పోరాటం చేస్తే కేసు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పదేండ్లు జెండా మోసిన దేవేందర్‌రెడ్డి ఆలోచన చేయాలని ... గుండ్రాత్‌పల్లిలో ప్రభాకర్‌రెడ్డి, గంగారంలో దేవెందర్‌రెడ్డిలు అనేక దందాలు చేసి ఆ కుటుంబానికి సేవ చేశారని, ఈనాడు కూడా ఇంకా కాంగ్రెస్ జెండాలు, దుద్దిళ్ల ఫోటోలు పెట్టుకోవడంపై ఆలోచన చేయాలన్నారు. మిమ్మల్ని వాడుకుని కరివేపాకులా తీసేస్తారని, ఇక్కడ మీకు పతార లేకపోవడంతోనే బారత రాజ్యాంగాన్ని అనుసరించి పోలీసు ఉద్యోగాలు పొందిన వారికి లాఠీ, తుపాకి ప్రజలను రక్షించడానికే ఇచ్చారని, కానీ నీచమైన పనులు చేస్తున్న పోలీసులకు ప్రాయశ్చిత్యం తప్పదన్నారు. అన్నం పెట్టి మంత్రి పదవి రావడానికి కాటారం మండల ప్రజలకే కారణమని, కాటారం ప్రజలు పెట్టిన బిక్షతోమంత్రి అయి ఈ ప్రాంత ప్రజలనే హింసిస్తూ అరిగోస పెడుతున్నాడని ఆయన మీ ఇంటి ఆడవాళ్లతో పోలీస్‌స్టేషన్‌కు పోయి కేసు పెట్టే పరిస్థితి వచ్చిందనే విషయాన్ని గమనించాలన్నారు. ఇప్పటికి దుద్దిళ్ల కుటుంబం ఎక్కడా కన్పించరు కానీ మీ ఆడవాళ్లు మాత్రం రోడ్డెక్కి పోలీస్‌స్టేషన్‌ల చుట్టూ తిరుగాలా అనేది ఆలోచించాలన్నారు. దుద్దిల్ల కుటుంబం గురించి అర్థం చేసుకున్న కనుకనే ఈనాడు తాను ఎమ్మెల్యే అయ్యానని, ఈ సమాజం అర్థం చేసుకోవాలనే తపన పడుతున్నానని అన్నారు. ఊసరవెల్లి కంటే ఎక్కువ దుద్దిళ్ల శ్రీధర్ అనేది ప్రతి ఒక్కరు అర్థం చేసుకుంటేనే బాగుపడుతారని ఆయన హితవు పలికారు. అధికారంలో లేనప్పుడు ఓ ఐపీఎస్ అధికారిని అవమానపర్చిన దుర్మార్గుడు దుద్దిళ్ల శ్రీధర్ అని ఆయన వివరించారు. ఓటు వేసే యంత్రాలుగానే ప్రజలను చూస్తారని, ప్రేమ అభిమానం ఉండదన్నారు. అధికారంలోకి వచ్చి నేటికి 24 నెలలు గడిచిపోయిందని ఇప్పటి వరకు 24మందికి ఉద్యోగాలో ఉపాధి అవకాశాలో కల్పించాడా లేక ఓ పరిశ్రమనైనా తీసుకువచ్చాడని ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. దుద్దిల్ల శ్రీధర్ చెప్పితే అక్రమ కేసులు పెట్టే పోలీసుల్లో మార్పు రావాలని, మారని ప్రతి పోలీస్ పేరును పింక్ బుక్‌లో రాసుకుంటున్నామని అన్నారు. రాజ్యాంగం అనుసరించి ఉద్యోగాలు వచ్చాయని పోలీసులు గమనించాలని శేఖర్‌రెడ్డిని మూడు రోజులు జైల్లో పెడితే ఎం వచ్చిందని ప్రశ్నించారు. అక్రమకేసులు పెడితే

# పోరు బాటలో ఎమ్మెల్యే మల్లారెడ్డి



మేడ్చల్( ప్రశ్న న్యూస్) హిల్ట్ పాలసీ కి వ్యతిరేకంగా బీఆర్ఎస్ పోరుబాట కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ పారిశ్రామిక వాడలో మేడ్చల్ బి ఆర్ ఎస్ అధ్యక్షులు భాస్కర్ యాదవ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి , జిల్లా పార్టీ అధ్యక్షులు శంభిపూర్ రాజు, పెద్ద ఎత్తున బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు . ప్రభుత్వం వెంటనే హిల్ట్ పాలసీ ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు, ప్లకార్డుల ప్రదర్శనతో చేపట్టిన నిరసన కార్యక్రమంలో కార్మికులు పాల్గొని మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూఐదు లక్షల కోట్ల హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్ఫర్మేషన్ పాలసీ పేరుతో భారీ కుంభకోణం జరిగిందన్నారు.భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద భూకంభకోణానికి కాంగ్రెస్ సర్కారు తెరలేపిందని ఆరోపించారు. హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్ఫర్మేషన్ పాలసీ పేరుతో భారీ కుంభకోణానికి తెరలేపారనిసాధారణంగా ప్రభుత్వాలు ఉపాధి కోసం, పరిశ్రమల కోసం అతి తక్కువ ధరకు లేదా ఉచితంగా, లేదా రాయితీలు ఇచ్చి కంపెనీలకు భూకేటాయింపులు చేస్తాయని రాష్ట్రానికి ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందని, ప్రభుతానికి ఆదాయం వస్తుందనే ఉద్దేశంతో ఈ భూములను అందిస్తారని తెలిపారు. ఈ విధంగా భూములు పొందిన వారు పరిశ్రమలు నడిపించి ప్రభుత్వం చెప్పిన ఉద్దేశాలను నెరవేర్చాలని,అలా హైదరాబాద్ లోని పారిశ్రామిక వాడల్లో దశాబ్దాల కింద 9292 ఎకరాల భూముల్ని పరిశ్రమల ఏర్పాటుకోసం కేటాయించారని తెలిపారు. అందులో అనేక ఏళ్లపాటు పరిశ్రమలు కొనసాగాయని హైదరాబాద్ విస్తరించడంతో ఆ పరిశ్రమలను దాటి జనావాసాలు ఏర్పడ్డాయని, అందులో కొన్ని పరిశ్రమలు మూతపడ్డాయని పేర్కొన్నారు అందులో చాలా మంది యజమానులు గత ప్రభుత్వం ఉన్నప్పుడు వాటిని రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వం దగ్గరికి వచ్చారని, అతి తక్కువ రేటుకి ఆ భూములను రెగ్యులరైజ్ చేయాలని ఒత్తిడి తెచ్చినా అంగీకరించలేదని తెలిపారు. ఇప్పుడు తాజాగా 9292 ఎకరాల పారిశ్రామిక భూముల పైన కన్నేశారని, కేవలం వారం రోజుల్లో దరఖాస్తులు, మరో వారం రోజుల్లో స్క్రూటినీ, కేవలం 45 రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలని చూస్తున్నాని ఆరోపించారు. హైదరాబాద్ నగరంలో పేదలకు ఇళ్ల నిర్మాణానికి, ప్రభుత్వఆసుపత్రులకు, పార్కులు, పిల్లల ఆట స్థలాలు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి స్థలాలు లేవు, చివరికి స్మశానానికి కూడా భూమి అందుబాటులో లేదని అలాంటిది ప్రజల ఆస్తిగా ఉన్న పారిశ్రామిక భూములను ఇప్పుడు రెగ్యులరైజేషన్ పేరుతో అనుయాయులకు అప్పనంగా కట్టబెట్టడం సరైన విధానం కాదని విమర్శించారు.కాంగ్రెస్ సర్కారుకు చిత్తశుద్ధి ఉంటే ఈ భూములను ప్రభుత్వం తీసుకొని%౦% ప్రజా ఉపయోగ కార్యక్రమాలకు వినియోగించాలని లేదా ఆ భూములను వెనక్కి తీసుకుని వేలం ద్వారా బహిరంగ మార్కెట్ లో అమ్మాలని కోరారు.కానీ ఇవేవీ చేయకుండా ఐదు లక్షల కోట్ల రూపాయల స్కాం చేస్తామంటే బీ ఆర్ ఎస్ పార్టీ తరపున మేము చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేద ని హెచ్చరించారు. ఈ భూములను ఎవరైనా ఇప్పుడు రెగ్యులరైజ్ చేసుకున్నా వారు భవిష్యత్తులో ఇబ్బందులు పడతారని. బి ఆర్ఎస్ ఆ భూములను వెనక్కి తీసుకొని ప్రజా ఉపయోగ కార్యక్రమాలకు వినియోగిస్తుందని తెలిపారు. ఈ భూకుంభకోణంపై ఓవైపు న్యాయపోరాటం చేస్తాం, మరోవైపు ఢిల్లీ వరకూ వెళ్లి కాంగ్రెస్ అవినీతిని జాతీయస్థాయిలో ఎండగడతామని,వెంటనే ప్రభుత్వం హిల్ట్ పాలసీని రద్దుచేసి ప్రభుత్వ భూములను తెగనమ్మే పన్నాగాలకు తెర దించాలని ఎమ్మెల్యే మల్లారెడ్డి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గం బి ఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ రాగిడి లక్ష్మ రెడ్డి,మేడ్చల్ నియోజకవర్గం బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు రాజ మల్లారెడ్డి, మద్దుల శ్రీనివాస్ రెడ్డి, దయానంద్ యాదవ్, నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తమిళంలో డెబ్యూ హీరో సంచలనం



ఒక పెద్ద సినీ కుటుంబానికి చెందిన కొత్త కుర్రాడు ఇండస్ట్రీలోకి అడుగు పెడుతుంటే.. డెబ్యూ మూవీ చేస్తుండగానే వేరే చిత్రాలు ఒకట్రెండు ఓకే అయితే ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. కొందరు హీరోయిన్లకు కూడా తొలి సినిమా రిలీజ్ కాకముందే.. ఆ సినిమా ప్రోమోలతో వచ్చిన గుర్తింపు వల్ల అవకాశాలు రావడం కొందరి విషయంలో జరిగింది.కానీ ఎలాంటి ఫిలిం బ్యాగ్రౌండ్ లేని కుర్రాడు నటిస్తున్న తొలి చిత్రం విడుదల కాకముందే మూణ్నాలుగు సినిమాల్లో ఛాన్సులు రావడం.. వాటికి సంబంధించి అగ్రిమెంట్లు జరిగిపోవడం అంటే సంచలనంగానే భావించాలి. తమిళంలో భారత్ అనే కుర్రాడు ఇప్పుడు ఇలాగే హాట్ టాపిక్‌గా మారాడు. అతను అప్పుడే ఐదు సినిమాల దాకా కమిటైపోయాడట. ఇదిప్పుడు కోలీవుడ్లో హాట్ టాపిక్‌గా మారింది. యూట్యూబ్‌లో 'ఫైనల్లీ' అనే ఛానెల్ ద్వారా మంచి పాపులారిటీ సంపాదించాడు భారత్. ఈ పాపులారిటీతోనే అతను 'మిస్టర్ భారత్' అనే సినిమాలో అవకాశం అందుకున్నాడు. తన పేరుతోనే ఈ సినిమా టైటిల్ పెట్టేయడం విశేషం.

ఈ సినిమా చిత్రీకరణ పూర్తి కావస్తోంది. ఇంతలోనే అతడికి ఇంకో మూణ్నాలుగు సినిమాల్లో అవకాశం దక్కింది. 'కుటుంబస్థాన్' మూవీతో తమిళంలో హిట్టు కొట్టిన తెలుగమ్మాయి శాన్వి మేఘనతో ఓ సినిమా.. అలాగే 'నింజా' పేరుతో మరో చిత్రం.. ప్రాథన అనే మరో అమ్మాయికి జోడీగా మరో సినిమా ఓకే చేశాడు. తొలి సినిమా విడుదల కాకముందే అతడికి ఎంత క్రేజ్ వచ్చిందంటే.. ఇటీవల కీర్తి సురేష్ తన కొత్త చిత్రం 'రివాల్వర్ రీటా' రిలీజ్ సందర్భంగా అతడితో ఒక ప్రమోషనల్ వీడియో కూడా చేసింది. కేవలం యూట్యూబ్ ఛానెల్‌తో ఇంత పేరు సంపాదించి.. వరుసగా సినిమా ఛాన్సులు అందుకోవడం, ఒక్క సినిమా కూడా రిలీజ్ కాకముందే చిన్న స్థాయి స్టార్ అయిపోవడం అరుదైన విషయం.

# భాగ్యశ్రీని అలా అనడం కరెక్టేనా?

సాధారణంగా సినిమాల ఫలితాల విషయంలో హీరోయిన్ల వాటా తక్కువ అన్నది వాస్తవం. మన సినిమాల్లో హీరోయిన్ల పాత్రలకు ప్రాధాన్యం తక్కువగానే ఉంటుంది. ఎక్కువగా వాళ్లు గ్లామర్ డాల్స్‌గానే కనిపిస్తుంటారు. తమ పాత్రలకు ప్రాధాన్యం ఉన్నపుడు వాటికి తమ నటనతో న్యాయం చేయడం.. అలాగే పాటల్లో అందచందాలతో సినిమాకు ఆకర్షణ తీసుకురావడం.. ప్రమోషన్ పరంగా వీలైనంత సాయం చేయడం.. ఇలా ఉంటుంది హీరోయిన్ల వ్యవహారం.

సినిమాలు సక్సెస్ కావడంలో హీరోయిన్లకు వారి పరిధిని అనుసరించి క్రెడిట్ ఇవ్వాలి కానీ.. ఫెయిల్యూర్ క్రెడిట్ వారి ఖాతాలో వేయడం మాత్రం అన్యాయమనే చెప్పాలి. హీరోయిన్ల వల్ల సినిమాలు చెడిపోయే సందర్భాలు అరుదుగా ఉంటాయి. కానీ ఒక హీరోయిన్ నటించిన సినిమాలు వరుసగా ఫ్లాప్ అయితే.. తన మీద ఐరెన్ లెగ్ ముద్ర వేసేయడం సోషల్ మీడియాలో కామన్ ప్రాక్టీస్ అయిపోయింది. గతంలో శ్రుతి హాసన్ కెరీర్ ఆరంభంలో నటించిన చిత్రాలు కొన్ని ఫెయిలయ్యాయని ఆమెను ఐరెన్ లెగ్ అనేశారు. కానీ తర్వాత ఆమె వరుస సక్సెస్‌లతో ఎలా దూసుకెళ్లిందో, ఎంత పెద్ద హీరోయిన్ అయిందో తెలిసిందే. వర్తమానంలో భాగ్యశ్రీ బోర్సే మీద కొందరు నెగెటివ్ ముద్ర వేయాలని చూస్తున్నారు. వరుసగా నాలుగు ఫ్లాపులిచ్చింది అంటూ ఆమెను ట్రోల్ చేస్తున్నారు. గత ఏడాది తెలుగులో తన తొలి చిత్రం 'మిస్టర్ బచ్చన్' పెద్ద డిజాస్టర్ అయింది. కానీ విడుదలకు ముందే ప్రోమోల్లో అందచందాలతో కుర్రాళ్ల దృష్టిని బాగా ఆకర్షించింది భాగ్యశ్రీ. ఆమె పేరు ఇండస్ట్రీలో మార్మోగడంతో అవకాశాలు వరుస కట్టాయి. కింగ్డమ్, కాంత, ఆంధ్ర కింగ్ తాలూకా, లెనిన్.. ఇలా వరుసగా బోలెడు ఛాన్సులు వచ్చాయి. కానీ వీటిలో ఇంకో మూడు సినిమాలు రిలీజయ్యాయి.





# ఓ..! సుకుమారి

**తిరువీర్, ఐశ్వర్యా రాజేష్ జంటగా నటించబోతున్న సినిమా 'ఓ..! సుకుమారి'. గంగా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై మహేశ్వర రెడ్డి మూలి నిర్మిస్తున్న ఈ చిత్రం ద్వారా భరత్ దర్శన్ డైరెక్టర్‌గా పరిచయం కాబోతున్నాడు. కాగా తాజాగా ఆకట్టుకునే పోస్టర్‌ను మేకర్స్ ఆవిష్కరించారు. నీలిరంగు హృదయ చిహ్నాన్ని ఒక అద్భుతమైన నారింజ రంగు మెరుపుతో డివైడ్ చేశారు. గ్రామ ప్రజలు పరిగెడుతూ కనిపంచడం కథలోని ఊహించని మలుపులను సూచిస్తుంది. ఇక ఈ సినిమాను తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో రిలీజ్ చేయబోతున్నారు మేకర్స్. 'రజాకార్', 'పొలిమేర' చిత్రాలకు సినిమాటోగ్రఫీ చేసిన సిహెచ్ కుషేందర్ ఈ చిత్రానికి కెమెరామెన కాగా ఎంఎం కీరవాణి శిష్యుడు భరత్ మంచిరాజు సంగీతం సమకూరుస్తున్నారు. పాపులర్ లిరిక్ రైటర్ పూర్ణచారి ఈ చిత్రంలోని అన్ని పాటలకు సాహిత్యం అందించబోతున్నారు.**

## అలా చేస్తున్నపుడు నా రోమాలు నిక్కబొడుచుకున్నాయ్

సమంత – రాజ్ నిడిమోరుల రెండో పెళ్లి జరిగి మూడ్రోజులవుతున్నా.. ఇంకా దీనిపైనే అంతా చర్చించుకుంటున్నారు. ఈ క్రమంలో రాజ్ – సమంతల వైవాహిక జీవితం బాగుండాలని కొందరు కోరుకుంటుండగా..మరికొందరు మాత్రం ఈ పెళ్లి మాత్రం ఎంతకాలం నిలుస్తుందిలే అని నిట్టూరుస్తున్నారు. కాగా.. వీరిద్దరి వివాహం ఈశా ఫౌండేషన్లో ఉన్న లింగభైరవి ఆలయంలో జరిగిన సంగతి తెలిసిందే. పెళ్లి ఫొటోల్లో సమంత పక్కనే ఆమెను హత్తుకుని, ముద్దు చేసిన స్నేహితురాలు, ఫ్యాషన్ డిజైనర శిల్పారెడ్డి పెళ్లికి సంబంధించిన కొన్ని విషయాలను తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో పంచుకున్నారు. సమంత – రాజ్ విజాతి ధృవాల్లాంటి వారని, సమంత యాక్టివ్ గా ఉంటే.. రాజ్ ది చాలా సైలెంట్ గా ఉండే మనస్తత్వమని పేర్కొన్నారు. ఇలాంటి పెళ్లిని తాను ఇంతవరకూ జీవితంలో చూడలేదన్నారు. ఇరుకుటుంబాల నుంచి .. వారి గురించిన పూర్తిగా తెలిసిన 10 మంది కుటుంబ సభ్యులు వచ్చారని, సినీ ఇండస్ట్రీ నుంచి నందినిరెడ్డి వచ్చారని చెప్పారు. ఎంతో నిరాడంబరంగా జరిగిన పెళ్లిలో.. అగ్నిదేవుడి ముందు వధువు వేలికి, వరుడి వేలికి సూత్రాన్ని ధరించే విధానాన్ని చూసి తన రోమాలు నిక్కబొడుచుకున్నాయని, వారిమధ్య ఏదో శక్తి వచ్చినట్లుగా అనిపించిందన్నారు శిల్పారెడ్డి. ఇక ఫేమస్ సింగర్ శోభరాజు రాజ్ కు బంధువు అన్న విషయం తనకు రీసంట్ గా తెలిసిందన్నారు. సమంత ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చిందని, ఆమెతో తనకున్న అనుబంధం గురించి మాటల్లో చెప్పలేనిదన్నారు. ఇద్దరం ఒకరిపై ఒకరం సెటైర్స్ వేసుకుంటాం అని, సరదాగా ఏడిపించుకున్న సందర్భాలు కూడా ఉన్నాయని గుర్తు చేసుకున్నారు.





# బాలయ్యకు కోపం ఎక్కువే...?

## సంయుక్త మీనన్ షాకింగ్ కామెంట్స్

**నందమూరి బాలయ్య హీరోగా చేసిన లేటెస్ట్ మూవీ అఖండ 2. ఈ సినిమా డిసెంబర్ 5వ తేదీన విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర బృందం ప్రమోషన్స్ లో పాల్గొంటోంది.అయితే ఈ నేపథ్యంలో ఓ హిందీ ఇంటర్వ్యూలో సంయుక్త మీనన్ చేసిన వ్యాఖ్యలు వైరల్ గా మారాయి. నందమూరి బాలయ్య క్యారెక్టర్ పై ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చాలామంది నందమూరి బాలయ్యకు కోపం ఎక్కువ అంటూ ప్రచారం చేస్తారు. సోషల్ మీడియాలో కూడా వాటికి సంబంధించిన వీడియోలు వైరల్ అవుతూ ఉంటాయి.. కానీ అందులో ఏ మాత్రం నిజం లేదని సంయుక్త మీనన్ తేల్చి చెప్పారు. బాలకృష్ణకు అసలు కోపమే రాదని క్లారిటీ ఇచ్చారు సంయుక్త మీనన్. ఆయన చాలా మంచి వ్యక్తి అంటూ కొనియాడారు. అఖండ 2 కథలో కీలక మలుపు తిప్పే పాత్ర తనకు వచ్చినట్లు సంయుక్త మీనన్ స్పష్టం చేశారు. ఈ సినిమా అంచనాలకు మించి ఉండబోతుందని, థియేటర్ లో బాక్సులు బద్దలు కావడం గ్యారెంటీ అన్నారు. సినిమా చూసిన ప్రతి ఒక్కరికి గూస్ బంప్స్ రావడం పక్కా అంటూ వ్యాఖ్యానించారు. దర్శకుడు బోయపాటి శ్రీను గ్రేట్ విజన్ తో ఈ సినిమా చేసినట్లు తెలిపారు. కాగా అఖండ 2 సినిమాలో నందమూరి బాలయ్య హీరోగా చేయగా సంయుక్త మీనన్ హీరోయిన్ గా మెరిశారు. ఈ సినిమాకు బోయపాటి శ్రీను దర్శకత్వం వహించారు. డిసెంబర్ 4వ తేదీనే ఈ సినిమా ప్రీమియర్స్ కూడా పడనున్నాయి.**

# కొత్త సినిమాతో రానున్న రిషబ్ శెట్టి

కన్నడ స్టార్ హీరో రిషబ్ శెట్టి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. కాంతార , కాంతార చాప్టర్ 1 సినిమాలతో ఇండస్ట్రీలను షేక్ చేశాడు. మొన్న దసరా కానుకగా కాంతార చాప్టర్ 1 సినిమాతో వచ్చిన రిషబ్ శెట్టి, దాదాపు రూ. 800 కోట్ల వసూళ్లు రాబట్టాడు. కాంతార సినిమాకు ప్రీక్వెల్ గా ఈ చాప్టర్ 1 వచ్చింది. దీంతో జనాలందరూ ఎగబడి చూశారు. అయితే ఇప్పుడు రిషబ్ శెట్టి తన తర్వాతి ప్రాజెక్టుపై ఫోకస్ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఇలాంటి నేపథ్యంలోనే టాలీవుడ్ సర్కిల్ లో ఓ న్యూస్ వైరల్ గా మారింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ లో రిషబ్ శెట్టి హీరోగా ఓ సినిమా రూపొందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇది ఓ యోధుడి కథ అని సమాచారం. చరిత్రలో మరుగున పడిపోయిన ఓ పోరాట గాథ అని టాక్ వినిపిస్తోంది. బంకించంద్ర ఛటర్జీ రచించిన ఆనంద్ మఠ్ అనే పుస్తకం నుంచి స్ఫూర్తిగా తీసుకొని ఈ కథను దర్శకుడు అశ్విన్ గంగరాజు రూపొందించినట్లు తెలుస్తోంది. 2026 వేసవిలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభిస్తారని ఇండస్ట్రీలో చర్చ నడుస్తోంది. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన కూడా రానుందట.



## ట్రాక్టర్ అదుపు తప్పి డ్రైవర్ మృతి




ఎల్లారెడ్డిపేట( ప్రశ్న న్యూస్) వెంకటాపూర్ గ్రామంలో ట్రాక్టర్ అదుపుతప్పి గడ్డం జితేందర్ అనే డ్రైవర్ మృతి. వివరాల్లోకి వెళితే వెంకటాపూర్ గ్రామానికి చెందిన గడ్డం జితేందర్(36) సంధ్య వేణి శ్రీనివాస్ వద్ద డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. శ్రీనివాస్ పొలం దున్నడానికి వెళుతుండగా పోతిరెడ్డిపల్లె రోడ్డుపై కల్టివేటర్ పై కేజీవిల్స్ పెట్టుకొని వెళుతుండగా మార్గ మధ్యలో మామిండ్ల లక్ష్మి వ్యవసాయ పొలం వద్ద జారిపడటంతో డ్రైవర్ జితేందర్ వెనుకకు తిరిగి చూడడంతో రోడ్డు క్రిందికి ట్రాక్టర్ దూసుకు వెళ్లి ప్రమాదం చోటుచేసుకుంది. ట్రాక్టర్ పల్టీ కొట్టడంతో శబ్దం విని చుట్టుపక్కల ఇంత వాళ్ళు వచ్చి గ్రామస్తుల సహకారంతో ట్రాక్టర్ను లేపి జితేందర్ ను బయటకు తీయడంతో అప్పటికే మరణించాడు. మృతుడికి భార్య దివ్య, కొడుకు విశాల్, తండ్రి బాలరాజు మృతిచెందగా తల్లి లక్ష్మి ఉన్నారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## కుక్కల బెడద నియంత్రణకు తక్షణ చర్యలు తీసుకోవాలి

**- కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు : వారాల నర్సింగం**



కరీంనగర్ (ప్రశ్న న్యూస్) కరీంనగర్ నగర పరిధిలోని విద్యానగర్ కాలనీలో కుక్కల బెడద రోజురోజుకూ తీవ్రంగా మారుతోందని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు వారాల నర్సింగం గురువారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి ఫిర్యాదు చేశారు. గత కొన్ని రోజులుగా కాలనీవాసులు కుక్కల బెడద వల్ల తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా గత నాలుగు రోజులుగా ఒక పిచ్చికుక్క విచ్చలవిడిగా తిరుగుతూ సుమారు 15 నుండి 20 మందిని కాటు వేసిన ఘటనలు చోటుచేసుకున్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయమై మున్సిపల్ అధికారులను ఎన్నిసార్లు సంప్రదించినా, వారు తాత్కాలిక చర్యలు మాత్రమే తీసుకొని సమస్యను పూర్తిగా పరిష్కరించడంలో విఫలమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శాశ్వత చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు ప్రాణభయంతో జీవిస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకొని ప్రజలకు భద్రత కల్పించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ వెంటనే మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాల్సిందిగా ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

## పోలీస్ సిబ్బందిని అభినందించిన ఎస్పీ మహేష్ బి.గితే



ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) వెంకటాపూర్ నామినేషన్ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ మహేష్ బీ. గితే విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందిని అభినందించారు. ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసి మొబైల్ ని కూడా సెంటర్లోకి తీసుకు వెళ్లకుండా బెంచ్ పై ఉండడాన్ని చూసిన ఎస్పీ చాలా బాగా విధులు నిర్వహిస్తున్నారని విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందిని అభినందించారు. ప్రజలు శాంతియుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా పోలీస్ యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపడుతుందని, దీనిలో భాగంగా పోలీస్ సిబ్బంది గ్రామాలను తరచూ సందర్శిస్తూ ఎన్నికలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ ఆకస్మిక తనిఖీలో సి ఐ శ్రీనివాస్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## కొల్చారం మండల వ్యాప్తంగా ప్రత్యర్థులు గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ల పర్వం

మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల నుండి రాంపూర్, కిష్టాపూర్ పోతంశెట్టిపల్లి, అప్పాజీపల్లి, వెంకటాపూర్, సీతారాం తండా, అంసన్పల్లి, పోతిరెడ్డిపల్లి, జలాల్పూర్, కొంగోడు, చిన్న ఘనపూర్, వరిగుంతం, రంగంపేట, తుక్కాపూర్, పైతర, కోనాపూర్, ఎనగండ్ల, మాదాపూర్ , గ్రామాలలో గురువారం నాడు తన ప్రత్యార్థులతో కలిసి గ్రామ సర్పంచి అభ్యర్థిగా నామినేషన్ పత్రాలతో ర్యాలీలతో డప్పు చప్పులతో, స్థానిక ఎంపీడీవో కార్యాలయానికి బయల్దేరి తన సర్పంచి అభ్యర్థులను మరియు వార్డు సభ్యులతో కలిసి నామినేషన్ పత్రాలను స్థానిక ఎన్నికల అధికారికి అందజేశారు ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అభ్యర్థులు మాట్లాడుతూ ఈ స్థానిక సంస్థ ఎన్నికలు అనేది గ్రామ అభివృద్ధిని తల రాతలు రాసే మంచి నాయకుడిని గెలిపించి గ్రామ అభివృద్ధి కోసం పాటుపడే నాయకుడిని ఎన్నుకోవాలని తెలిపారు గ్రామ సర్పంచ్ పదవి కోసం చాలామంది పోటీల్లో ఉంటారు కానీ గెలుపు మాత్రం ఒకరే గెలుస్తారు కాబట్టి ఆ వ్యక్తిని ఆ గ్రామాన్ని అభివృద్ధి చేస్తాడు అనే నమ్మకం ఉంటేనే ఆ వ్యక్తిని గెలిపించి ఆ గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని గ్రామ సర్పంచి అభ్యర్థులు ఓటర్లను వేడుకున్నారు.

## లైఫ్ లైన్ తులసి హాస్పిటల్‌లో అరుదైన నోటిద్వారా థైరాయిడ్ సర్జరీ విజయవంతం



కాప్రా (ప్రశ్నన్యూస్)ఈ.సి.ఐ.ఏల్ లైఫ్ లైన్ తులసి హాస్పిటల్‌లో వైద్యులు మరో అరుదైన, అత్యాధునిక శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి వైద్య రంగంలో తమ ప్రతిభను మరోసారి చాటుకున్నారు. 60 ఏళ్ల వయస్సున్న ఒక వ్యక్తి గొంతులో థైరాయిడ్ సమస్యతో ఆసుపత్రికి రాగా, అన్ని విస్తృత పరీక్షలు నిర్వహించిన అనంతరం నోటిద్వారా ఎండోస్కోప్ సహాయంతో బయట ఎలాంటి కట్స్, సిజరింగ్ లేకుండా "ట్రాన్స్ ఓరల్ ఎండోస్కోపిక్ థైరాయిడ్ వెస్టిబ్యులర్ విధానం" పద్ధతిలో థైరాయిడ్ సర్జరీని విజయవంతంగా పూర్తి చేశారు. సాధారణంగా ఈ తరహా ఆపరేషన్లు చేయాలంటే ఎంతో అనుభవం, నైపుణ్యం కలిగిన వైద్యులు అవసరం. అలాంటి అరుదైన శస్త్రచికిత్సను ఈస్ట్ హైదరాబాద్‌లో కేవలం లైఫ్ లైన్ తులసి హాస్పిటల్‌లో మాత్రమే నిర్వహించడం గర్వకారణం అని ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది. ఈ శస్త్రచికిత్స అనంతరం పేషెంట్ 24 గంటలలోనే లేచి నడవడం ప్రారంభించడం వైద్య బృందానికి మరింత ఆనందాన్ని కలిగించింది.
ఈ సందర్భంగా లైఫ్ లైన్ తులసి హాస్పిటల్ చైర్మన్, చీఫ్ సర్జన్ డా. జె.ఎస్. రాజ్ కుమార్ మాట్లాడుతూ పద్ధతిలో నోటిద్వారా థైరాయిడ్ సర్జరీ చేసి పేషెంట్‌కు బయట ఎలాంటి మచ్చలు లేకుండా వేగంగా కోలుకునేలా చేయడం అత్యంత సంతోషకరం. ఇది మా ఆసుపత్రి వైద్య బృందం సమష్టి కృషికి ప్రతిఫలం. ఈ విజయంతో ఈస్ట్ హైదరాబాద్ ప్రజలకు మరింత మెరుగైన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించగలుగుతాం అన్నారు. ఈ ఆపరేషన్‌లో డా. జె.ఎస్. రాజ్ కుమార్‌తో పాటు డా. కల్నల్ కె.ఆర్. రావు, డా. కరుణాకర్, డా. ప్రఫుల్, డా. భార్గవ పాల్గొన్నారు. అత్యాధునిక సౌకర్యాలతో పాటు అనుభవజ్ఞులైన వైద్యుల సేవలతో లైఫ్ లైన్ తులసి హాస్పిటల్ ఈ ప్రాంత ప్రజలకు విశ్వసనీయ వైద్య సేవలు అందిస్తోందని పలువురు అభిప్రాయపడ్డారు.

# విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకే.. వైజ్ఞానిక ప్రదర్శనలు

**పుస్తకాలతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా అలవరుచుకోవాలి**

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**




మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) జిల్లాస్థాయి ఇన్స్పైర్, సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని జిల్లా విద్యా శాఖ అధికారులుగురువారం స్థానిక వెస్లీ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారుసైన్స్ ఫెయిర్ కన్వీనర్ కలెక్టర్ రాహుల్ రాజ్ జిల్లా విద్యాధికారి విజయ, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విద్యారిని విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ జ్యోతి ప్రజ్వలన గావించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారుజిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ. ఎంచుకున్నటువంటి థీమ్,సబ్ థీమ్లు అభిరుచులకు తగ్గట్టుగా ఈ కాలానికి, మన దేశానికి అవసరమైనటువంటివిగా ఉన్నాయన్నారు. విద్యార్థులు కేవలం సైన్స్ చదవడం కాకుండా ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని తమ జ్ఞానాన్ని ఇంకా పెంపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు స్మార్ట్ ఫోన్ ద్వారా అందుబాటులో ఉన్నటువంటి ఏ ఐ ఆప్స్( %జష్ట్రఘ్ ‡ఊ, +వఎఱఅఱ వ్‌ష% )ద్వారా ఎటువంటి సమాచారాన్ని అయినా సరైన సూచనలు ఇచ్చి మనం పొందగలిగే అవకాశం ఉన్నందున విద్యార్థులు ఈ యొక్క అవకాశాన్ని మంచికి ఉపయోగించి తమ జ్ఞానాన్ని పెంపొందించుకొని మంచి భవిష్యత్తు పొందాలని ఆయన సూచించారు. పలు పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చే ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా లాంటి సంస్థలతో ఒప్పందం కుదుర్చుకొని మన పాఠశాల విద్యార్థులందరికీ కోర్స్ మెటీరియల్ పొందే అవకాశం కల్పించిందని తమ వద్ద ఉన్నటువంటి స్మార్ట్ ఫోన్ల ద్వారా ఉపాధ్యాయుల సహకారంతో ఖాన్ అకాడమీ ఫిజిక్స్ వాలా కి సంబంధించిన బోధన వీడియోలు వీక్షించాలని, కాలాన్ని వృధా చెయ్యరాదని, స్మార్ట్ ఫోన్ ను మంచి పనులకు ఉపయోగించాలని ఆయన అన్నారు. సైన్స్ ఫెయిర్ ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ అధికారులని కలెక్టర్ ప్రశంసించారు జిల్లా విద్యాశాఖ అధికారి విజయ మాట్లడుతూ...భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని, తమ తమ అభిరుచి, ఆసక్తి అనుగుణంగా తమ కోర్సు ఎంచుకొని జీవితంలో రాణించాలని విద్యార్థులకు సూచించారు. ఇందుకు గాను ఉన్న సౌకర్యాలు సంపూర్ణంగా వినియోగించుకోవాలని అన్నారు. ప్రదర్శన గదులలోని ప్రాజెక్టలని.. కలెక్టర్ ప్రారంభించి వీక్షించారువిద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు, పరికరాలను వీక్షించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమం లో సైన్స్ ఫెయిర్ 425 ఇన్స్పైర్ 50 ప్రాజెక్ట్ లను ప్రదర్శించారు.

## ప్రజలు శాంతియుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేల చర్యల

**గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా నామినేషన్ సెంటర్స్, చెక్ పోస్టులు ఆకస్మిక తనిఖీ**



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) ఎల్లారెడ్డిపేట, ముస్తాబద్ మండలాలలో పలు నామినేషన్ సెంటర్స్ తోపాటుగా పెద్దమ్మ, వెంకట్రావుపల్లి చెక్ పోస్ట్ లను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ మహేష్ బి.గితే. గ్రామపంచాయితీ ఎన్నికల సందర్భంగా ఎల్లారెడ్డిపేట, ముస్తాబద్ మండలలో ఏర్పాటు చేసిన నామినేషన్ సెంటర్స్ తో పాటుగా పెద్దమ్మ , వెంకట్రావుపల్లి చెక్ పోస్ట్‌లను ఆకస్మికంగా తనిఖీ చేసి విధుల్లో ఉన్న సిబ్బందితో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సర్పంచ్ ఎన్నికలు నిర్వహించే గ్రామ పంచాయతీలకు, వార్డులకు మూడవ విడత నామినేషన్ ప్రక్రియ ప్రారంభ కావడం జరిగిందని, నామినేషన్ ప్రక్రియకు అనుగుణంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత ఏర్పాట్లును చేయడం జరిగిందన్నారు. సర్పంచ్ ఎన్నికల సందర్భంగా జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసి 24/7 పర్యవేక్షణ కొనసాగిస్తు అక్రమ మద్యం, డబ్బు రవాణాలను అడ్డుకునేందుకు ప్రతీ వాహనాన్ని చెక్‌పోస్టుల వద్ద క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు శాంతియుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా పోలీసు యంత్రంగం పకడ్బందీ చర్యలు చేపడుతుందని, దీనిలో భాగంగా పోలీస్ సిబ్బంది గ్రామాలను తరచూ సందర్శిస్తూ ఎన్నికలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నమని, ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లగించిన వారిపై ఇప్పటికే ఒక కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లాలో అక్రమ మద్యం తయారీ, రవాణా, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి బెల్ట్‌షాపులపై ఆకస్మిక దాడులు నిర్వహించగా, 20 కేసుల్లో 209 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకోవడం జరిగిందని, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా 158 కేసుల్లో 657 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఎస్పీ వెంట సి.ఐ లు శ్రీనివాస్, మొగిలి,ఎస్.ఐ లు గణేష్, అనిల్ సిబ్బంది ఉన్నారు.

## ఎంపీడీఓ కార్యాలయాలను తనిఖీ చేసిన జిల్లా వ్యయ పరిశీలకులు రాజ్ కుమార్



బోయినిపల్లి/ఇల్లంతకుంట (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా జిల్లా వ్యయ పరిశీలకులు రాజ్‌కుమార్ గురువారం బోయినిపల్లి, ఇల్లంతకుంటఎంపీడీఓ కార్యాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయాలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించి, వ్యయ పర్యవేక్షణకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నిబంధనలను కఠినంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి నవీన్, భారతి, ఎంపీడీఓ లక్ష్మీనారాయణతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఒక్కసారి అవకాశం ఇవ్వండి అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తా...!

**రాంపూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి నెల్లి రాజు**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండల పరిధిలోని రాంపూర్ గ్రామ సర్పంచ్ ఇండిపెండెంట్ అభ్యర్థిగా నెల్లి రాజు గురువారం నాడు సర్పంచి అభ్యర్థిగా మరియు వార్డు సభ్యుల నామినేషన్ కు రాంపూర్ గ్రామ ప్రజలతో కలిసి డప్పు చప్పులతో సుమారు 200 మందితో కలిసి నామినేషన్ వేయడానికి బయలుదేరారు ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అభ్యర్థి నెల్లి రాజు మాట్లాడుతూ ఒకసారి అవకాశం ఇవ్వండి రాంపూర్ గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతారని నెల్లి రాజు తెలిపారు రాంపూర్ గ్రామ ప్రజలందరూ కలిసి ఏకతాటికై నన్ను భారీ మెజార్టీతో గెలిపించాలని గ్రామ ప్రజలను వేడుకున్నారు.

## బీసీ బిల్లులపై నిర్లక్ష్యం తగదు

**- బీసీ సాధికారత సంఘం ఉమ్మడి జిల్లాధ్యక్షులు**

**- పొలాస నరేందర్**



వేములవాడ ( ప్రశ్న న్యూస్) పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో కేంద్రం ప్రవేశపెట్టిన 14 బిల్లుల్లో బీసీ రిజర్వేషన్ల బిల్లులు లేకపోవడం దారుణమని బీసీ సాధికారిత సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు పొలాస నరేందర్ విమర్శించారు. మార్చి 17న రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించిన బీసీ బిల్లులు 8 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఢిల్లీ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి, ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని కలిసినా బీసీ బిల్లులపై చర్చించకపోవడాన్ని ప్రశ్నించారు. అలాగే బీసీ బంధులో పాల్గొన్న ఆర్టీసీ ఉద్యోగుల జీతాలు కట్ చేయడం చిత్తశుద్ధి లోపాన్ని చూపిస్తోందని పేర్కొంటూ, జీతాలు వెంటనే చెల్లించాలని, లేనియెడల ఆందోళన తప్పదని హెచ్చరించారు.

## మహిళలు ఆర్థిక స్వాలంబన సాధించాలి



మంథని, (ప్రశ్న న్యూస్) మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థిక స్వాలంభన సాధించాలని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ రూరల్ మేనేజర్ సాదినేని కవిరాజు అన్నారు. గురువారం మంథని పట్టణంలోని శ్రీపాద కాలనీలో అమ్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉష శిలాయి స్కూల్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నామని, మహిళలు మరొకరిపై ఆధారపడకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. శిక్షణ శిక్షణ పొందిన ప్రతి ఒక్క మహిళా పారిశ్రామికవేత్తలుగా ఉద్యమ్ (ఎం ఎస్ ఎం ఈ) రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 30 మంది మహిళలకు కుట్టు శిక్షణ ధ్రువీకరణ పత్రాలు ట్రైనింగ్ మెటీరియల్, బోర్డులు అందజేశారు. ఈ కార్యక్రమానికి అమ్మ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అంకరి కుమార్ అధ్యక్షత వహించగా కుట్టు శిక్షకురాలు అజ్మీరా షారోన్, అంకరి పద్మజా తో పాటు పలువురు పాల్గొన్నారు.

# అక్రమ పార్కింగ్ అరికట్టడంలో ట్రాఫిక్ పోలీసులు విఫలం చెందారా.?

- ఉప్పల్ సర్కిల్లో అక్రమ పార్కింగ్ లతో నిత్యం ట్రాఫిక్ జామ్
- చౌరస్తాలో ఎప్పుడు చూసినా పోలీసులు ఉంటారు కానీ చర్యలు తీసుకోరు ఎందుకో
- అన్నపూర్ణ భోజనం ముందు కూడా రోడ్డు కబ్జా చోద్యం చూస్తున్న ట్రాఫిక్ పోలీసులు
- స్ట్రీట్ వెండర్ కార్డులు ఎంతమంది ఉన్నాయి పరిశీలించారా.?
- కార్డులు లేని వారిపై చర్యలు తీసుకోరా.? మామూళ్లు ఇస్తున్నారా.?
- హెూటల్స్ ముందు ఇష్టానుసారంగా రోడ్లపై పార్కింగ్ చేసిన చర్యలు తీసుకోరా.?
- స్థానికులు ఫిర్యాదు చేసిన సమస్యలకు పరిష్కారం చూపరా.?
- పార్కింగ్ స్థలం లేకపోతే టిఫిన్ సెంటర్లు, హెూటల్స్ లు, షాపింగ్ మాల్స్ ల వద్ద అనుమతులు ఎందుకు ఇస్తున్నారు
- ఉప్పల్లో ట్రాఫిక్ సమస్యలను ఉన్నత అధికారులు పట్టించుకోరా.? పర్యవేక్షణ చేసి వదిలేస్తారా.?



**ఉప్పల్( ప్రశ్న న్యూస్)** ఉప్పల్ సర్కిల్ పరిధిలో అనేక హెూటల్ ల వద్ద షాప్ ల వద్ద, రోడ్ల పక్కన ఉన్న ఫుట్ పాత్ లపై దర్జాగా వ్యాపారం చేస్తుంటే చర్యలు తీసుకోవలసిన ట్రాఫిక్ పోలీసులు మాకెందుకులే అన్నట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొంతమంది వ్యాపారులకు పార్కింగ్ స్థలం లేకపోవడంతో ఇష్టానుసారంగా రోడ్లపైనే తమ వాహనాలను నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఏర్పడుతున్నాయని ట్రాఫిక్ పోలీస్ అధికారులకు స్థానికులు ఎన్నిసార్లు సమస్యపై వివరించిన అప్పటి వరకే తూ తూ మంత్రంగా సమస్యను పరిష్కరించి తదనంతరం సమస్యను పట్టించుకోకుండా, అటువైపు కన్నెత్తి చూడకుండా ఉంటున్నారని ట్రాఫిక్ పోలీసులు ఎందుకు విఫలము చెందుతున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. హెూటల్స్ వద్ద టిఫిన్ సెంటర్ల వద్ద కిరాణా దుకాణాల వద్ద ద్విచక్ర వాహనం పెట్టుకునే పార్కింగ్ స్థలం లేకపోయినా వ్యాపార స్థలాలు వెలుస్తున్నాయని పార్కింగ్ స్థలం లేని వ్యాపార సంస్థలకు కమర్షియల్ నిర్మాణాలకు మున్సిపల్ అధికారులు అనుమతులు ఎలా ఇచ్చారని ప్రజలు



విమర్శిస్తున్నారు. పార్కింగ్ స్థలం లేకపోతే అలాంటి వ్యాపార సంస్థలపై ఎందుకు చర్యలు తీసుకుంటూ లేరని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉప్పల్ సర్కిల్ పరిధిలో పిస్తా హౌస్ వద్ద రాఘవేంద్ర హెూటల్, సత్తిబాబు బిర్యానీ హెూటల్స్ ల వద్ద నిత్యం పార్కింగ్లతో ప్రజలకు ఇబ్బంది కలుగుతున్న ఉప్పల్ ట్రాఫిక్ పోలీసులు ఆ హెూటల్ పై చర్యలు తీసుకోరా.? ఉప్పల్ బస్ స్టాప్ లో ఫుట్పాత్ కబ్జా చేసి ప్రయాణికులు నిలబడకుండా వ్యాపారాలు నిర్వహిస్తుంటే ట్రాఫిక్ పోలీసులు మాత్రం మున్సిపల్ అధికారుల పైన తోసివేసి పట్టించుకోవడంలేదని స్ట్రీట్ వండర్ కార్డులు ఎంతమందికి ఉన్నాయో లేవో అసలు ట్రాఫిక్ పోలీసుల వద్ద సమాచారం ఉన్నదా.? స్ట్రీట్ వండర్ కార్డులు లేని వారే చాలామంది అక్రమంగా రోడ్లపై వ్యాపారం చేస్తూ ట్రాఫిక్ సమస్యను సృష్టిస్తుంటే చర్యలు తీసుకోకుండా ట్రాఫిక్ పోలీసులు మౌనంగా ఉండడం వెనుక మామూలే కారణమా అంటూ ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. మద్యం దుకాణాల వద్ద బార్ల వద్ద రోడ్లపైనే ఇష్టాను సారంగా ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తున్నారని సాయంత్రం వేళలో ట్రాఫిక్ కు చాలా ఇబ్బంది కలిగిస్తున్నారని అలాంటి వాటి వద్ద ట్రాఫిక్ పోలీసులు నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేసి రోడ్లపై పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలకు చాలాన్లు ఎందుకు వేయడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఉప్పల్ సర్కిల్లో ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని కమర్షియల్ నిర్మాణాలు చేపట్టడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నాయని ప్రభుత్వాలు అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టిన కమర్షియల్ షాప్ లపై మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇదేవిధంగా ఫుట్ పాత్ లను, రోడ్లను కబ్జా చేసి వ్యాపారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోకుండా కాలక్షేపడం చేయడం వెనుక నెల నెల మామూలే కారణమా అంటూ వాహనదారులు ప్రశ్నిస్తున్నారు మరి దీని వెనుక నిజమెంతనో ఉన్నత అధికారులకే తెలియాలి.

## హైదరాబాద్‌లో బాలుడిపై వీధి కుక్కల దాడి

### - నివేదిక కోరిన మానవ హక్కుల కమిషన్




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్‌లో ఎనిమిదేళ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసిన ఘటనపై తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ స్పందించింది. నగర శివారులోని హయత్ నగర్ శివగంగా కాలనీలో ప్రేమ్‌చంద్ అనే ఎనిమిదేళ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనకు సంబంధించి పలు దినపత్రికల్లో వచ్చిన కథనాలను సుమోటోగా స్వీకరించిన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కమిషనర్, జిల్లా కలెక్టర్‌లకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 29వ తేదీ లోపు నివేదిక ఇవ్వాలని పేర్కొంది. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు, బాలుడి ప్రస్తుత పరిస్థితి, కుక్కల స్టెరిలైజేషన్, నియంత్రణ చర్యల స్థితిగతులను నివేదికలో పేర్కొనాలని ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాల అమలు తీరుపై సమగ్ర నివేదిక అందజేయాలని కోరింది.

# ఏసీపి కృష్ణమోహన్ సహకారం పూర్తయిన అక్రమ షెడ్ నిర్మాణం

- లంచాలు ఇస్తే మా సర్కిల్లో ఏ అక్రమైన చేసుకోండి అన్నట్లు
- ప్రభుత్వ నియమ నిబంధనలు కాప్రా సర్కిల్లో పనిచేయవా.?
- డిప్యూటీ కమిషనర్ టౌన్ ప్లానింగ్ డిసిపి ఏకమైతే నిబంధనలను గాలికేనా.?
- డిసి, డిసిపి అక్రమాలపై చర్యలకు వెనుకాడుతున్న విజిలెన్స్, కమిషనర్ కర్ణన్
- కాప్రా సర్కిల్లో అవినీతి అక్రమాలు రాజమేలుతున్న నిద్రపోతున్న రేవంత్ సర్కార్
- కాప్రా సర్కిల్ అక్రమాలపై స్థానిక ఎమ్మెల్యే స్పందించరా.?







నాచారం (ప్రశ్న న్యూస్) జిహెచ్ఎంసిలో అవినీతి అక్రమాలను కట్టడి చేయవలసిన అధికారులే వాటిని ప్రోత్సహిస్తూ మామూళ్ళు తీసుకొని ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొట్టడమే కాకుండా ప్రభుత్వ నియమ నిబంధనలు తుంగలో తొక్కి మున్సిపల్ శాఖ అంటే అంత అవినీతి అన్నట్లుగా తయారు చేస్తున్నారు. ధనార్జన ధ్యేయంగా అధికారుల అవినీతి దందా జోరుగా సాగుతోంది సర్కిల్ పరిధిలో డిప్యూటీ కమిషనర్, డిప్యూటీ సిటీ ప్లానర్ ఇలా ప్రతి విభాగంలో అధికారులు సిబ్బంది మొత్తం లంచాల దాహంలో మునిగిపోతున్నారు. ప్రభుత్వానికి రావలసిన కోట్ల ఆదాయాన్ని గండికొట్టి అక్రమాలకు కొమ్ముకాస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అయిన పాలనకులలో ఏ మాత్రం మార్పు రాకపోవడం విడ్డూరంగా మారింది. అందులో భాగంగా కాప్రా సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాల పరంపర జోరుగా కొనసాగుతోంది. డిప్యూటీ కమిషనర్, డిప్యూటీ సిటీ ప్లానర్ ఏకమై అక్రమ నిర్మాణాల పంట పండిస్తున్నారని ప్రభుత్వానికి గండికోడుతూ కోట్లు వెనుకేసుకుంటున్నారని ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తున్నారు. పేరుకు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే ఉన్న అధికారులు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలే శిరోధార్యం అన్నట్లు వాళ్లు చేసే అక్రమాలకు పూర్తిగా సహకరిస్తున్నారు. మల్లాపూర్ డివిజన్ పరిధిలో అక్రమంగా షెడ్ నిర్మాణం జరుగుతుందని దానిలో వైన్స్ ఏర్పాట్లు జరుగుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేసిన పత్రికలలో కథనాలు వచ్చిన కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్, టౌన్ ప్లానింగ్ డిసిపి కృష్ణమోహన్ వాటిని కట్టడి చేయకుండా అండగా నిలిచి నిర్మాణానికి పూర్తి సహాయ సహకారాలు అందించారని అక్రమలు చేసేవారికి రెడ్ కార్పెట్ పరుస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. విజిలెన్స్ అధికారులు నిర్లక్ష్యం వల్ల ఇలా అవినీతి పెరిగిపోతుందని మండిపడుతున్నారు.

### డిసిపి కృష్ణ మోహన్ సహకారం పూర్తయిన షెడ్ నిర్మాణం

జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ విభాగంలో అధికారులకు లంచాలు ఇస్తే చాలు ఏ రకంగా అయినా అక్రమాలకు సహకరిస్తారు. చట్టంలో ఉన్న లోసుగులు వీళ్లకు కిల్లి నమిలినంత సులభంగా మారాయి. దానితో అక్రమ షెడ్లకు టౌన్ ప్లానింగ్ డిసిపి పూర్తిగా సహకరించినందుకు లక్షలలో చేతులు మారినట్లు స్థానికుల గుసగులుసులు వినిపిస్తున్నాయి. ఇదే కాకుండా కాప్రా సర్కిల్ పరిధిలో టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతి అంతం లేకుండా పోయింది. చర్లపల్లి డివిజన్లో ఒక్క భవనాన్ని రెండుసార్లు సీజ్ చేశారు అంటే అధికారుల, చైన్ మెన్ అవినీతి ఎంత తీవ్ర స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇంత జరుగుతుంటే ఎల్బీనగర్ జోనల్ కమిషనర్, జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్, సిటీ చీఫ్ ప్లానర్ చర్యలు తీసుకోకుండా నిమ్మకు నేరెత్తనట్లు వ్యవహరించడం విడ్డూరంగా మారింది. ఉన్నత అధికారులు లక్షలలో జీతాలు తీసుకొని ఏసీ గదిలో రిలాక్స్ అవుతుంటే కింద జరిగే అవినీతి అక్రమాలను ఎవరు పట్టించుకుంటారో. సాక్షాత్ మున్సిపల్ శాఖ ముఖ్యమంత్రి దగ్గర ఉండి కూడా ఇంత అవినీతి అక్రమాలకు పాల్పడుతుందంటే ముఖ్యమంత్రి కి అధికారులు ఇచ్చే విలువ ఎంత తీవ్రంగా అవినీతిని పెంచి పోషించిందో అర్థం చేసుకోవచ్చు. స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సైతం కాప్రా సర్కిల్ లో జరుగుతున్న అక్రమాలపై స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది అసలు ఎమ్మెల్యే అవినీతి అక్రమాలను పట్టించుకోరా.? ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అధికారులను మందిలించారా.? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైన జిహెచ్ఎంసి కమిషనర్ స్పందించి అవినీతిపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.




## పాస్ పోర్ట్ పడిపోయినది తిరిగి ఇవ్వగలరు

మహమ్మద్ పాస్యుద్దీన్ తండ్రి పైముద్దీన్ 17వ పోలీస్ బెటాలియన్ లో విధులు నిర్వహిస్తూ, ఉద్యోగరీత్యా సిరిసిల్ల రెడ్డివాడలో నివాసం ఉండి చంద్రంపేటకు ఇల్లు మారుతున్న సమయంలో పాస్ పోర్ట్ పడిపోయినది. కావున పాస్ పోర్ట్ దొరికితే తిరిగి ఇవ్వగలరని మనవి.

**చిరునామా**

మహమ్మద్ పాస్యుద్దీన్ తండ్రి పైముద్దీన్ ఇంటి నంబర్:2-6-326/108, పోలీస్ హెడ్ క్వార్టర్స్, కరీంనగర్.
మొబైల్ నెంబర్:9494978601

# మంచి మంచి మందు తాగుర్రి బిడ్డ

### కల్తీ మందు తాగి ప్రాణాలు ఖరాబు చేసుకోవద్దురయ్యా
### పెద్దల హెచ్చరికలు పెడచెప్పిన పెడుతున్న యువత

**(దుర్గం విజయ్ బాబు - ప్రశ్న న్యూస్ బ్యూరో)** పంచాయతీ ఎన్నికల పండగ పల్లెల్లో రాజకీయాలు ఆసక్తి రేపుతున్నాయి. గ్రామాల్లో చిత్ర, విచిత్ర ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. సర్పంచ్‌గా బరిలో దిగాలని ఉన్నప్పటికీ ఓటర్లు ఏఏ మందు కావాలని అడుగుతారోనని ఆగమాగం అవుతున్నారు అభ్యర్థులు. ఎన్నికలు అంటే చాలు కల్తీ మద్యం రెడీగా ఉంటది. కొంతమంది కల్తీ మద్యం యదేచ్ఛగా సరఫరా చేస్తూ కోట్లు గడిస్తారు వాళ్లకు ప్రజల ప్రాణాలతో పనేలేదు కేవలం ధనార్జనే వాళ్ళ లక్ష్యం. కల్తీ మద్యంతో ఎంతోమంది ప్రజలు ప్రాణాలు పోగొట్టుకున్న మద్యం తయారీ, సరఫరా చేసిన వాళ్లపై ఇప్పటికి కేసులు కూడా పెట్టని సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఫలానా బ్రాండ్ మందు కావాలని కోరడంతో అప్పటికప్పుడు తీసుకువచ్చి బ్రతిమిలాడి ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. మందు తాగిన ఓటరు ఓటు వేస్తాడో మరో నలుగురిని వేయకు అని చెబుతాడో అని భయం భయంతో అడిగిన మందును బతిలాడి మరి ఇస్తూ, దండాలు పెడుతూ దినదిన గండంగా బ్రతుకుతున్నారు. మందు ఎవరు చెప్తారు, మర్యాదగా ఎవరు ఉంటారని చూస్తూ నామినేషన్లు వేయిస్తున్నారు. మరికొందరు నాటు సరుకు కోసం తహతహ లాడుతుండడం చూసి వారి కోరికను తీర్చే పనిలో పడ్డారు. ఊరిలో జాతరను తలపించేలా మందు విందు ఏర్పాటు చేసి మరీ ఏకగ్రీవాలు చేస్తున్నారు.పంచాయతీ ఎన్నికల పండగ వేళ గ్రామాల్లో జాతరను తలపించేలా ఏర్పాటులు జరుగుతున్నాయి. సర్పంచ్ పీఠమెక్కేందుకు ఆశావహులు విభిన్న ప్రయత్నాలు చేస్తున్నారు. రిజర్వేషన్లు అనుకూలంగా వచ్చిన వారు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో ఉండగా, మిగతా వాళ్లు తిప్పలు పడుతున్నా ప్రయత్నాన్ని మాత్రం విరమించట్లేదు.



### పెద్దల హెచ్చరికలు పెడచెవిన పెడుతున్న యువత

మంచి మంచి మందు తాగుర్రి బిడ్డ వట్టిగనే ఇస్తురు కదా అని, కల్తీ మందు తాగి ప్రాణం నష్టం చేసుకుని దావఖానలో లక్షల రూపాయలు ఖర్చులు పెట్టి ఇండ్లు ముంచోద్దని పెద్దలు హెచ్చరిస్తున్నారు. వారి హెచ్చరికలు వెనుక కారణం కూడా దాగి ఉంది గతంలో జరిగిన ఎన్నికల్లో కల్తీ మద్యం ఏరులై పారి ఎంతోమంది అనారోగ్యానికి గురై హాస్పటల్లో లక్షల రూపాయలు పోగొట్టుకున్న వారు ఉన్నారు. ప్రాణాలు పోయి అతలాకుతులమైన కుటుంబాలు కూడా ఉన్నాయి. గతంలో జరిగిన తప్పిదాలను గుర్తుచేస్తూ, మద్యానికి దూరంగా ఉండాలని చెప్పకనే చెబుతున్నారు. కొత్తగా ఓటు వేసే యువ ఓటర్లను బీర్ కాటన్ లు, రకరకాల కల్తీ మద్యాన్ని ఎరగావేసి మద్యానికి బానిసలుగా మారుస్తున్న వైనం బయటపడుతుంది. ఎప్పుడు తాగని కొడుకు హంగామా సృష్టిస్తుంటే భయబ్రాంతులకు గురి అయిన కుటుంబ సభ్యులు కల్తీ మందు తాగి ప్రాణాలు ఖరాబు చేసుకోవద్దురయ్యా అంటూ హెచ్చరిస్తున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588